ఎంపీ అభ్యర్థి కోసం వైసీపీ తర్జనభర్జన

- కూటమి తరపున బీజేపీ అభ్యర్థిగా సీఎం రమేశ్ బరిలో ఉంటారని ప్రచారం జరగడంతో దీటైన అభ్యర్థి కోసం ప్రయత్నాలు
- బూడి ముత్యాలనాయుడును పోటీలో నిలబెడతారని జోరుగా ప్రచారం

- వార్త 7వ పేజీలో..



ఎన్నికల సందడి

కోడ్ అమలు

- రూ.50 వేలకు మించి నగదు తీసుకువెళ్లకూడదు
- వ్యాపారులకు ముందస్తు అనుమతి తప్పనిసరి

ఎన్నికల షెడ్యూల్	
నోటిఫికేషన్	18-04-2024
నామినేషన్ల గడువు	25-04-2024
నామినేషన్ల పరిశీలన	26-04-2024
ఉపసంహరణ	29-04-2024
పోలింగ్ తేదీ	13-05-2024
ఓట్ల లెక్కింపు	04-06-2024

- రాత్రి 10 వరకే ఎన్నికల ప్రచారం
- రాత్రి 11 గంటలకు బార్లు మూసివేయాల్సిందే
- ఏప్రిల్ 18న ఎన్నికల ప్రకటన
- మే 13న పోలింగ్
- జూన్ 4 కౌంటింగ్

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

ఎన్నికల నగారా మోగింది. ప్రవర్తన నియమావళి అమలులోకి వచ్చింది. ఇప్పటివరకు విచ్చలవిడిగా అధికార పార్టీనేతల అడుగులకు మడుగులొత్తిన అధికారులు ఇకపై అలా చేయడానికి వీల్లేదు. వలంటీర్లు స్థానిక నాయకులతో చెట్టపట్టాలేసుకొని తిరిగితే కుదరదు. ఎమ్మెల్యే అభ్యర్థి ఇచ్చారనో, ఎంపీ పంపారనో కానుకలు తీసుకొని ఇంటింటికీ వెళితే...చర్యలకు గురికావలసి ఉంటుంది. వలంటీర్లు ఎన్నికల విధులు, రాజకీయ వ్యవహారాలకు దూరంగా ఉండాలని ఎన్నికల సంఘం స్పష్టంచేసింది. ఎన్నికల ప్రవర్తన నియమావళిని కచ్చితంగా అమలు చేస్తామని జిల్లా యంత్రాంగం ప్రకటించింది.

ఎన్నికల సంఘం కొరడా ఝళిపించడం ప్రారంభించింది. పార్వతీపురం మన్యం జిల్లా వీరఘట్టంలో శనివారం భద్రతా దళాలు మార్చ్ ఫాస్ట్ నిర్వహించగా, అందులో స్థానిక నాయకుడు ఒకరు ముందుండి నడిచారు. ఆ పక్కనే ఎస్.ఐ. గోవిందరావు ఉన్నా వారించకుండా కలిసి నడవడంతో ఆయన్ను సస్పెండ్ చేస్తూ ఎన్నికల సంఘం ఆదేశాలు ఇచ్చింది.

ఏప్రిల్ 18న ఎన్నికల ప్రకటన

ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నికలకు సంబంధించి ఏప్రిల్ 18న ప్రకటన విడుదల అవుతుంది. ఏప్రిల్ 25 వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. 26న వాటిని పరిశీలిస్తారు. అభ్యర్థుల ఉపసంహరణకు 29 వరకు అవకాశం ఉంది. మే 13న పోలింగ్ నిర్వహిస్తారు. జూన్ 4న ఓట్ల లెక్కింపు జరుగుతుంది.

నగదు రవాణాపై ఆంక్షలు

ఎన్నికల ప్రక్రియ ముగిసేంత వరకు నగదు రవాణాపై ఆంక్షలు ఉంటాయి. ఎవరైనా సరే రూ.50 వేలకు మించి తీసుకువెళ్లకూడదు. అలా ఏమైనా చేస్తే స్వాధీనం చేసుకుంటారు. వ్యాపార అవసరాల కోసం తీసుకెళితే ముందుగానే అనుమతి తీసుకోవాలి.

ప్రచారంపై ఆంక్షలు

ఎన్నికల ప్రచారం ఉదయం 6 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకే అనుమతిస్తారు. ప్రభుత్వ భవనాలు, కార్యాలయాలు, ఇతర ఆస్తులపై ప్రచారానికి సంబంధించిన పోస్టర్లు, ఫ్లెక్సీలు ఉంటే తొలగించాలి.

ఎంపీ అభ్యర్థి రూ.95 లక్షలు, ఎమ్మెల్యే అభ్యర్థి రూ.40 లక్షలు వరకు ఖర్చు పెట్టవచ్చు.

కోడ్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి



మాట్లాడుతున్న జిల్లా ఎన్నిక అధికారి, కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి

అనకాపల్లి, మార్చి 16 (అనకాపల్లి): ఎన్నికల షెడ్యూల్ శనివారం విడుదలైనందున అదే రోజు సాయంత్రం నుంచి ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి తెలిపారు. సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ విడుదల నేపథ్యంలో శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఎన్నికల కమిషన్ నియమ, నిబంధనలకు లోబడి అధికారులు పనిచేయాలని సూచించారు. ఎవరైనా కోడ్ ఉల్లంఘనలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లాలో అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో రాజకీయ నాయకుల చిత్రపటాల తొలగింపునకు చర్యలు చేపట్టామన్నారు. ఈ ప్రక్రియ కలెక్టరేట్ కార్యాలయం నుంచే ప్రారంభించినట్టు తెలిపారు. జిల్లాలో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా 24 ఎస్ఎస్‌టీ బృందాలను నియమించినట్టు చెప్పారు. జిల్లాలో పోలింగ్‌కు అవసరమైన బ్యాలెట్ యూనిట్స్ 4,782, కంట్రోల్ యూనిట్స్ 3,913, వీవీ ప్యాడ్స్ 4,594 ఉన్నాయని, అదనంగా బఫర్ స్టాక్ కూడా అందుబాటులో ఉంచామని చెప్పారు. ఎన్నికల ప్రక్రియను పర్యవేక్షించేందుకు కలెక్టరేట్‌లో కమాండ్ కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశామన్నారు. ఎస్పీ కేవీ మురళీకృష్ణ మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున రూ.50 వేలు మించి నగదు తీసుకువెళ్లేందుకు అనుమతి ఉండదన్నారు. సమావేశంలో డీఆర్‌వో దయానిధి, ఏఎస్పీ విజయ్‌భాస్కర్, ఎంసీఎంసీ నోడల్ అధికారి లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



వైసీపీలో వీడిన ఉత్కంఠ

అనకాపల్లి, పాయకరావుపేటకు కొత్త ముఖాలు

- మిగతా ఐదు అసెంబ్లీ స్థానాల్లో పాతవారే..
- అధిష్ఠానం ప్రకటనతో ఊపిరిపీల్చుకున్న అభ్యర్థులు

(అనకాపల్లి- ఆంధ్రజ్యోతి)

అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో అభ్యర్థులను వైసీపీ అధిష్ఠానం శనివారం ఖరారు చేసింది. అనకాపల్లి అసెంబ్లీ స్థానం నుంచి బరిలో దిగుతున్న మలసాల భరత్‌కుమార్ మినహా మిగిలిన చోట్ల సిట్టింగ్ ఎమ్మెల్యేలకే సీట్లు కేటాయించింది. అయితే పాయకరావుపేట అసెంబ్లీ స్థానాన్ని విజయనగరం జిల్లా రాజాం సిట్టింగ్ ఎమ్మెల్యే కంబాల జోగులుకు కేటాయించడంతో వీరిద్దరూ ఈ ప్రాంతానికి కొత్త ముఖాలే.



కరణం ధర్మశ్రీ



బూడి ముత్యాలనాయుడు



రమణమూర్తి రాజు



పెట్ల ఉమాశంకర్ గణేశ్



కంబాల జోగులు



మలసాల భరత్‌కుమార్



అదీప్‌రాజ్

సిట్టింగ్‌లకే అవకాశం

ఎలమంచిలి అసెంబ్లీ స్థానం నుంచి యు.వి.రమణమూర్తి రాజు(కన్నబాబురాజు), చోడవరం నుంచి కరణం ధర్మశ్రీ, నర్సీపట్నం నుంచి పెట్ల ఉమాశంకర్‌గణేశ్, మాడుగుల నుంచి బూడి ముత్యాలునాయుడు, పెందుర్తి నుంచి అదీప్‌రాజు ఎన్నికల బరిలో దిగుతున్నారు. ఈ మేరకు సిట్టింగ్‌లకు అవకాశం ఇస్తున్నట్టు అధిష్ఠానం ప్రకటించింది. దీంతో అభ్యర్థులు ఊపిరిపీల్చుకున్నారు. సిట్టింగ్‌ల్లో ఎవరికి సీటు దక్కుతుందోనని ఇప్పటి వరకు క్యాడర్‌లో సందిగ్ధం ఉంది. అధిష్ఠానం ప్రకటనతో ఉత్కంఠకు తెర పడింది.

ధర్మశ్రీకి మరో చాన్స్

చోడవరం: చోడవరం అసెంబ్లీ స్థానం నుంచి పోటీ చేయడానికి కరణం ధర్మశ్రీకి నాలుగోసారి అవకాశం వచ్చింది. 2004లో మాడుగుల ఎమ్మెల్యేగా గెలిచిన ధర్మశ్రీ 2009 ఎన్నికల సమయంలో మాడుగుల నుంచి చోడవరం అసెంబ్లీ స్థానానికి మారి, కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో దిగారు. ఆ ఎన్నికల్లో ఓడిపోవడంతో 2009లో వైసీపీలో చేరి ఎన్నికల్లో పోటీ చేశారు. 2009, 2014 ఎన్నికల్లో కేఎస్ఎన్ఎస్ రాజు చేతిలో స్వల్ప ఓట్ల తేడాతో ఓటమి పాలైన ధర్మశ్రీ, 2019లో మాత్రం విజయం సాధించారు.

బూడి.. మూడోసారి

మాడుగుల: నియోజకవర్గ వైసీపీ అభ్యర్థిగా సిట్టింగ్ ఎమ్మెల్యే డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు మరోసారి ఎన్నికల బరిలో దిగుతున్నారు. మూడోసారి ఆయనకు అవకాశం దక్కింది. 2014, 2019 ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి గవిరెడ్డి రామానాయుడుపై పోటీ చేసి గెలుపొందారు.

ఐదోసారి కన్నబాబురాజు పోటీ

ఎలమంచిలి: ఎలమంచిలి ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తి రాజు(కన్నబాబు రాజు) ఐదోసారి అసెంబ్లీ ఎన్నికల బరిలోకి దిగుతున్నారు. కన్నబాబు రాజు ఇప్పటి వరకు నాలుగు సార్లు ఎన్నికల బరిలో నిలవగా ఒకసారి ఓటమి చెంది, మూడుసార్లు విజయం సాధించారు. 1999 సంవత్సరంలో రాజకీయ ప్రవేశం చేసి కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేసి ఓటమి చెందారు. తరువాత 2004లో, 2009లో కాంగ్రెస్ పార్టీ తరపున పోటీచేసి ఎమ్మెల్యేగా గెలుపొందారు. అనంతరం 2014లో జరిగిన ఎన్నికల్లో పోటీ చేయలేదు. తరువాత వైసీపీలో చేరి 2019 ఎన్నికల్లో విజయం సాధించారు.

మూడోసారి బరిలోకి పెట్ల

నర్సీపట్నం: నియోజకవర్గం వైసీపీ అభ్యర్థిగా పెట్ల ఉమాశంకర్ గణేశ్ మూడోసారి ఎన్నికల బరిలో ... మిగతా 6వ పేజీలో

ఆటోను ఢీకొన్న కారు

- 12 మందికి గాయాలు
- క్షతగాత్రులు లంకెలపాలెం దరి మారేడుపూడి కాలనీ వాసులు



సంఘటన స్థలంలో క్షతగాత్రులు

చోడవరం, మార్చి 16: పట్టణ శివారులో ఆటోను కారు ఢీకొనడంతో ఆటోలోని 12 మంది గాయపడ్డారు. దీనికి సంబంధించి సీఐ తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. గాజువాక దరి లంకెలపాలెం మారేడుపూడి కాలనీ నుంచి 12 మంది పట్టణంలోని ఓ ఫంక్షన్‌కు శనివారం ఆటోలో వచ్చారు. సాయంత్రం తిరిగి స్వగ్రామానికి వెళుతుండగా, పట్టణ శివారు బీఎన్ రోడ్డులో ఎదురుగా అనకాపల్లి నుంచి వస్తున్న కారు ఈ ఆటోను బలంగా ఢీకొంది. దీంతో ఆటో రోడ్డు పక్కన ఉన్న పొలాల్లోకి దూసుకుపోయింది. ఈ ప్రమాదంలో ఆటోలో ఉన్న 12 మందిలో ఇద్దరికి తీవ్ర గాయాలు, 10 మందికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను సీఐ శ్రీనివాసరావు, సిబ్బంది పోలీసు వాహనాల్లో ప్రభుత్వ కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం తీవ్రంగా గాయపడిన వారిని అనకాపల్లి ఆస్పత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్ లక్ష్మోజీపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

ఎన్నికల కోడ్ నేపథ్యంలో స్పందన రద్దు

అనకాపల్లి కలెక్టరేట్, మార్చి 16: సార్వత్రిక ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున కోడ్ కాలం పూర్తయ్యేంత వరకు ప్రతి సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమాన్ని రద్దు చేసినట్టు డీఆర్‌వో బి.దయానిధి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా ప్రజలు విషయాన్ని గమనించాలని ఆయన కోరారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (ఆది)	6.11
సహరి (సోమ)	4.50

ఉక్కు ప్రైవేటీకరణకు ఒప్పుకోం

- ప్లాంటు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కాంగ్రెస్ డిక్లరేషన్



అభివాదం చేస్తున్న తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షురాలు షర్మిల

ఉక్కుటౌన్‌షిప్, మార్చి 16: విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ డిక్లరేషన్ ప్రకటించింది. ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణకు తాము ఎట్టి పరిస్థితుల్లో ఒప్పుకోబోమని, తమ ప్రాణాలు అడ్డు పెట్టయినా పోరాడతామని ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ప్రకటించారు. శనివారం ఉక్కునగరంలోని తృష్ణా మైదానంలో స్టీల్‌ప్లాంటు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నిర్వహించిన 'న్యాయ సాధన సభ'లో ఆమె పాల్గొని ప్రసంగించారు. ఉక్కు పరిరక్షణకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని, ఎప్పుడు పిలిచినా వెంటనే వస్తానని ప్రకటించారు. సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ మాట్లాడుతూ దేవాలయం లాంటి ఉక్కు కర్మాగారాన్ని కాపాడుకునేందుకు ప్రజలు, కార్మికులు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్ నరసింగరావు మాట్లాడుతూ ప్రభుత్వ రంగంలో ఉన్న సంస్థను కాపాడుకుంటే అన్నివర్గాల ప్రజలకు ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. ఈ సమావేశానికి పీసీసీ మాజీ అధ్యక్షులు గిడుగు రుద్రరాజు అధ్యక్షత వహించగా, తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు కేవీపీ రామచంద్రరావు, కనుమూరి బాపిరాజు, తులసీరెడ్డి, రాకేష్‌రెడ్డి, మయ్యప్పన్, కొయ్య ప్రసాద్‌రెడ్డి, గొంప గోవిందరావు, జెర్రిపోతుల ముత్యాలు, పాశర్ల ప్రసాద్, కేఎస్ఎన్ రావు, నీరుకొండ రామచంద్రరావు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టో పోస్టర్‌ను రేవంత్‌రెడ్డి, షర్మిలల ఆవిష్కరించారు.

రేపటి నుంచి టెన్త్ పరీక్షలు

జిల్లాలో 108 పరీక్షా కేంద్రాల్లో నిర్వహణ

హాజరుకానున్న 21,259 మంది రెగ్యులర్, 2,324 మంది ప్రైవేటు విద్యార్థులు



అనకాపల్లి, మార్చి 16: పదో తరగతి పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ నెల 30వ తేదీ వరకు జిల్లాలో 108 కేంద్రాల్లో నిర్వహించే ఈ పరీక్షలకు విద్యాశాఖాధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. పరీక్షలు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 వరకు జరుగుతాయి. విద్యార్థులను 8.45 గంటలకు పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించనున్నారు. మొత్తం 21,259 మంది హాజరుకానున్నారు. వీరిలో బాలురు 10,873 మంది, బాలికలు 10,386 మంది రెగ్యులర్ విద్యార్థులు ఉన్నారు. అలాగే ప్రైవేటు విద్యార్థులు మొత్తం 2,324 మంది హాజరుకానున్నారు. నిర్దేశించిన సమయం కంటే ఆలస్యంగా వచ్చిన వారిని కేంద్రంలోకి అనుమతించరు. పరీక్షా కేంద్రాలకు మొబైల్ ఫోన్ల వంటి ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించరు. పరీక్షా కేంద్రాలన్నీ నో మొబైల్ జోన్లుగా ప్రకటించారు. డీఈవో, చీఫ్ సూపరింటెండెంట్, ఇతర అధికారులు సైతం పరీక్షా కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లు, పేజర్లు, క్యాలిక్యులేటర్లు వంటి ఎలక్ట్రానిక్ వస్తువులను తీసుకువెళ్లకూడదు. అన్ని కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుంది.

అక్రమార్కుల అడ్డదారి

లేఅవుట్‌కు రోడ్డు కోసం గెడ్డపై కల్వర్టు నిర్మాణానికి ఏర్పాట్లు

- వైసీపీ ప్రభుత్వ సలహాదారుడి వద్ద పని చేసే రెవెన్యూ ఉన్నతాధికారి అండతో పనులు
- రాత్రికి రాత్రే పైపులు అమర్చిన వైనం
- పట్టించుకోని రెవెన్యూ, నీటి పారుదల శాఖ అధికారులు
- కలెక్టర్‌కు ఫిర్యాదు చేసేందుకు స్థానికులు సన్నద్ధం



కల్వర్టు నిర్మించేందుకు ప్రధాన గెడ్డలో ఏర్పాటు చేసిన పైపులు

లంకెలపాలెం, మార్చి 16:

అక్రమణలకు అడ్డూ అదుపు లేకుండాపోతోంది. గెడ్డలను సైతం అక్రమార్కులు వదలడం లేదు. పరవాడ మండలం లంకెలపాలెం రెవెన్యూ పరిధిలో ఓ లేఅవుట్‌కు రోడ్డు కోసం శుక్రవారం రాత్రి గెడ్డలో పైపులు ఏర్పాటు చేసి కల్వర్టు నిర్మాణానికి సిద్ధమయ్యారు. దీని వెనుక వైసీపీ ప్రభుత్వ సలహాదారుడి వద్ద పని చేసే ఓ రెవెన్యూ ఉన్నతాధికారి ఉండడంతో అధికారులు పట్టనట్టు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

పరవాడ మండలం లంకెలపాలెం రెవెన్యూ పరిధి సర్వే నంబరు 143లో స్వాతంత్ర్య సమరయోధుల (పొలిటికల్ సఫరర్స్) కోటా కింద 35 ఏళ్ల కిందట ఓ వ్యక్తికి సుమారు 5 ఎకరాల డీపట్టా భూమిని ప్రభుత్వం కేటాయించింది. ప్రస్తుతం ఈ భూమిలో జీడి మామిడి తోటలు ఉన్నాయి. అయితే ఇందులో లేఅవుట్ వేసేందుకు కొన్ని రోజులుగా చదును చేస్తున్నారు. లేఅవుట్‌కు వీఎంఆర్‌డీ నుంచి అనుమతులు రావాలంటే పక్కాగా ప్రధాన రహదారి నుంచి రోడ్డు సౌకర్యం ఉండాలి. ఈ భూమిని ఆనుకొని, జాతీయ రహదారికి మధ్య సర్వే నంబరు 141, 142లలో సుమారు 20 మీటర్ల వెడల్పున 2.6 ఎకరాల విస్తీర్ణంలో ప్రభుత్వ గెడ్డ విస్తరించి ఉంది. దీంతో అక్రమార్కుల కళ్లు ఈ గెడ్డపై పడ్డాయి. ఇందు కోసం వైసీపీ ప్రభుత్వ సలహాదారుడి వద్ద పని చేస్తున్న తమ బంధువైన రెవెన్యూ ఉన్నతాధికారిని సంప్రతించారు. దీనికి ఆయన నుంచి భరోసా లభించినట్టు తెలిసింది.

రాత్రికి రాత్రే పైపుల ఏర్పాటు

ఎలాంటి అనుమతులు లేకపోయినా గత రెండు రోజులుగా ఎక్స్‌కవేటర్ సాయంతో గెడ్డలో ఉన్న ముళ్ల పొదలు తొలగించారు. శుక్రవారం రాత్రి పైపులను తీసుకొచ్చి గెడ్డలో అమర్చారు. ప్రజా అవసరాల నిమిత్తం ప్రధాన గెడ్డలో నుంచి రహదారి సౌకర్యం కావాలంటే రెవెన్యూ, నీటి పారుదల శాఖ అధికారుల నుంచి అనుమతులు కావాలి. నిబంధనలు అనుసరించి పనులు చేపట్టాలి. అయితే ఇక్కడ ఎటువంటి నిబంధనలు పాటించలేదు. మరో రెండు రోజుల్లో పనులు పూర్తి చేయడానికి ప్రణాళిక రూపొందించారు. లేఅవుట్ నుంచి సుమారు 50 మీటర్ల మేర జాతీయ రహదారిని కలుపుతూ రోడ్డు ఏర్పాటుకు చర్యలు చేపట్టారు. ప్రభుత్వ ... మిగతా 6వ పేజీలో

రోడ్డు పనులను అడ్డుకున్న టీడీపీ నేతలు

పరవాడ, మార్చి 16: రావాడ రెవెన్యూ పరిధిలోని శృంగారపాడులో గెడ్డవాగులోంచి రహదారి నిర్మాణానికి ఓ రియల్టర్ ప్రయత్నించగా టీడీపీ నాయకులు శనివారం అడ్డుకున్నారు. రియల్టర్ లేఅవుట్ కోసం గెడ్డవాగులోంచి రహదారి వేయడానికి వీల్లేదని తేల్చి చెప్పారు. ఈ విషయాన్ని రెవెన్యూ అధికారులకు తెలియజేయడంతో వారు అక్కడకు చేరుకుని పనులను నిలుపుదల చేశారు. పనుల కోసం తీసుకువచ్చిన ఎక్స్‌కవేటర్‌ను తరలించారు. దీంతో పనులు నిలిచిపోయాయి. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు వియ్యపు చిన్న, కార్యకర్తలు పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ

రాంబిల్లి, మార్చి 16: ఈనెల 18వ తేదీ నుంచి జరగనున్న పదో తరగతి పరీక్షలకు హాజరయ్యే కొత్తపట్నం హైస్కూల్ విద్యార్థులకు జనసేన నాయకుడు గబ్బర్‌సింగ్ పరీక్ష సామగ్రిని శనివారం అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీధర్‌రెడ్డి, టీచర్లు భారతి, నాగమణి, జనసేన నాయకులు బి.గంగరాజు, గణేష్, చిరంజీవి పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములుకు భారతరత్న ఇవ్వాలి

ఎలమంచిలి, మార్చి 16: పట్టణంలోని దిమిలి రోడ్డు జంక్షన్‌లో శనివారం అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతిని ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా అమరజీవి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆర్యవైశ్య సంఘం రూరల్ జిల్లా అధ్యక్షుడు కట్టా సత్యనారాయణ తదితరులు పొట్టి శ్రీరాములకు భారతరత్న ఇవ్వాలని కోరుతూ తహసీల్దారు అప్పలరాజుకు వినతిపత్రాన్ని అందజేశారు.

న్యాయవాదుల దీక్ష తాత్కాలిక విరమణ

అనకాపల్లి టౌన్, మార్చి 16 : అనకాపల్లి కోర్టు వద్ద బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు శనివారం నుంచి తాత్కాలికంగా నిలిపివేసినట్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శేఖరమంత్రి సాయి వెంకట లక్ష్మణరావు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చినభూ యాజమాన్య హక్కు చట్టం-2023ను నిరసిస్తూ చేస్తున్న దీక్షలను ఎన్నికల కోడ్ రావడంతో విరమింపజేశామన్నారు.

జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా సుజాత

కోటవురట్ల, మార్చి 16: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా డాక్టర్ ఏఆర్‌టీ సుజాత శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈమె విశాఖ ఉమెన్ ప్రభుత్వ కళాశాలలో ఎకనామిక్స్ లెక్చరర్‌గా పని చేసి పదోన్నతిపై ఇక్కడ ప్రిన్సిపాల్‌గా నియమితులయ్యారు.ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కొండబాబు నుంచి ఆమె బాధ్యతలు స్వీకరించారు.

నక్కపల్లి వారపు సంత వేలం పాట ఖరారు

నక్కపల్లి, మార్చి 16: నక్కపల్లిలో ప్రతీ శుక్రవారం జరిగే వారపుసంతలో ఆశీలు వసూలుకు శనివారం మండల పరిషత్ కార్యాలయంలో వేలం పాట నిర్వహించారు. వైస్ ఎంపీపీ వీసం నానాజీ, ఎంపీడీవో శ్రీనివాస్, ఏవో డి.సీతారామరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన వేలంలో అనేకమంది పాటదారులు పాల్గొన్నారు. ఉపమాక గ్రామానికి చెందిన కొప్పిశెట్టి కొండబాబు రూ15.83లక్షలకు సంత వేలంపాటను దక్కించుకున్నారని అధికారులు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ వీసం రాజు పాల్గొన్నారు.

గౌరీ పరమేశ్వరుల సారె ఊరేగింపు

ఎలమంచిలి, మార్చి 16: పట్టణంలోని తులసీనగర్‌లో శనివారం గౌరీ పరమేశ్వరుల సారె ఊరేగింపు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులంతా దేవతామూర్తులు దర్శించుకుని, మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం మహిళలు, స్థానికులు గౌరీ పరమేశ్వరుల సారె ఊరేగింపును నిర్వహించారు.

ఎన్నికల నిబంధనలు పక్కాగా అమలు

అనకాపల్లి అసెంబ్లీ నియోజకవర్గ ఆర్వో జాహ్నవి



అనకాపల్లి టౌన్, మార్చి 16 : ఎన్నికల నిబంధనలు పక్కా అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని అనకాపల్లి అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారిణి జాహ్నవి చెప్పారు. శనివారం ఆర్డీవవో కార్యాలయంలో ఎన్నికల అధికారిణిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఆమె విలేకర్లతో మాట్లాడారు. ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు 40 మందితో కమాండ్ కంట్రోల్ బృందం ఏర్పాటు చేశామన్నారు. నియోజకవర్గంలో 251 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, రెండు లక్షల 11వేల 808 మంది ఓటర్లు ఉన్నారన్నారు. నిబంధనల అమలుకు మండలస్థాయిలో ఎంపీడీవో, సీఐ, తహసీల్దార్‌లతో మోనటరింగ్ టీమ్‌ను ఏర్పాటు చేశామన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రం పరిధిలో బీఎల్‌వో, వీఆర్వో, సచివాలయ పోలీస్‌తో టీమ్‌ను ఏర్పాటు చేశామన్నారు. ఎనిమిది మంది ఏఆర్‌వోలను నియమించామని, సెక్టర్‌కు 25 మంది, రూట్ ఆఫీసర్లు 25 మంది, సూపర్‌వైజర్‌లను 25 మందిని నియమించామన్నారు.

నక్కపల్లిలో.. సార్వత్రిక ఎన్నికలనియమావళిని, కోడ్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పాయకరావుపేట నియోజకవర్గ రిటర్నింగ్ అధికారిణి కె.గీతాంజలి హెచ్చరించారు. శనివారం ఆమె స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ.. ఎన్నికల నిర్వహణకు ఫ్లయింగ్ స్క్వాడ్‌లతోపాటు మొత్తం 5 బృందాలను నియమించామని, ఇందులో వీడియో కవరేజ్ టీం కూడా వుంటుందన్నారు. ఎన్నికల కోడ్ శనివారం సాయంత్రం నుంచి అమలులోకి వచ్చిందన్నారు. అన్ని గ్రామాల్లోని రాజకీయ పార్టీల కటౌట్లు, బ్యానర్లు తొలగించామని ఆదేశాలు జారీ చేశామన్నారు. ఈ సమావేశంలో నక్కపల్లి, పాయకరావుపేట, కోటవురట్ల తహసీల్దార్లు శ్రీకాంత్, సూర్యనారాయణ, జయలక్ష్మి, ఎస్.రాయవరం డీటీ కుమారస్వామి, నక్కపల్లి డీటీ సత్యనారాయణ,ఆర్ఐ కన్నబాబు పాల్గొన్నారు.

రాంబిల్లిలో.. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిందని తహసీల్దార్ బి.అప్పలస్వామి, ఎంపీడీఓ ఎస్.వెంకటాచలం అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ సెక్రటరీలు, వీఆర్‌వోలు, బీఎల్‌వోలు, వీఆర్ఏలతో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ఫలితాలు వచ్చేంతవరకు ఎన్నికల నియమావళి అమలులో ఉంటుందని, సిబ్బంది విధులను సక్రమంగా పాటించాలన్నారు.

సబ్బవరంలో.. ఎన్నికల నియమావళి పక్కాగా అమలు చేయాలని తహసీల్దార్ జె. చలమయ్య సూచించారు. శనివారం ఎన్నికల నియమావళిపై రెవెన్యూ సిబ్బందికి ఆయన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ కార్యాలయాలు, గ్రామ సచివాలయాల్లోనూ, పంచాయతీల్లోను రాజకీయ నాయకుల పటాలను తీసివేయాలని సూచించారు. గ్రామాల్లో అక్రమ మద్యం, డబ్బులు, కానుకలు పంపిణీ చేస్తే ఉన్నతా. దికారులకు, పోలీసు, ఎక్సైజ్ అధికారులకు తెలియజేయాలని సూచించారు. ఏఎస్‌వో రమాదేవి, ఆర్ఐ వీరయ్య పాల్గొన్నారు.

ఎలమంచిలిలో.. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహించేందుకు సర్వం సిద్ధం చేశామని ఎలమంచిలి నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి కె.మనోరమ తెలిపారు. శనివారం తహసీల్దారు కార్యాలయంలో ఆమె విలేకర్లతో మాట్లాడుతూ.. నియోజకవర్గంలో 246 పోలింగ్ స్టేషన్లను సిద్ధం చేశామన్నారు. నియోజకవర్గంలో మొత్తం 2,05,120 ఓటర్లు ఉన్నారని, వీరిలో 99,760 మంది పురుషులు, 1,05,351 మంది మహిళలు, 9 మంది ఇతరుల ఓటర్లు ఉన్నారన్నారు. నియోజకవర్గంలో 21 రూట్‌లు ఏర్పాటు చేసి, రూట్ అధికారులు, సెక్టార్ అధికారులను నియమించామన్నారు. ఇప్పటికే సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించామన్నారు.

అచ్యుతాపురంలో.. ఎన్నికల కోడ్‌ని సక్రమంగా అమలు చేయాలని తహసీల్దార్ పి.సరోజిని అన్నారు. శనివారం ఎంపీడీఓ కార్యాలయంలో జరిగిన వీఆర్ఓ, పంచాయతీ కార్యదర్శుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఎన్నికల కోడ్‌ని అమలుతో గ్రామాల్లో ఫ్లెక్సీలు, కార్యాలయాల్లోని ప్రజాప్రతినిధుల ఫొటోలు, విగ్రహాలకు ముసుగులు వేయాలన్నారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ ఏఓ కృష్ణ పాల్గొన్నారు.

సింహాద్రి సీఎస్ఆర్ కార్యక్రమాలు భేష్

▸▸ ఎన్టీపీసీ హెచ్ఆర్ డైరెక్టర్ దిలీప్‌కుమార్ పటేల్

పరవాడ, మార్చి 16 : సింహాద్రి యాజమాన్యం నిర్వాసిత గ్రామాల్లో చేపడుతున్న సీఎస్ఆర్ కార్యక్రమాలు బాగున్నాయని ఎన్టీపీసీ హెచ్ఆర్ డైరెక్టర్ దిలీప్‌కుమార్ పటేల్ ప్రశంసించారు. శనివారం ఆయన సింహాద్రి ప్లాంట్‌ను సందర్శించారు. ప్లాంట్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన ప్రొఫెనల్ సర్కిల్ కన్వెన్స్ -2024ను ప్రారంభించారు. అలాగే ప్రాంతీయ అభ్యాస సంస్థ (ఆర్ఎల్ఐ) శిక్షణ సౌకర్యాన్ని ఆవిష్కరించారు. అనంతరం దిలీప్‌కుమార్ పటేల్ మాట్లాడుతూ సంస్థ పురోభివృద్ధికి అధికారులు శక్తి వంచన లేకుండా కృషిచేయాలన్నారు. యూనియన్, అసోసియేషన్ అండ్ ఎగ్జిక్యూటివ్ ట్రైనీలతో సమావేశాలు నిర్వహించారు. అంతకుముందు ఆయన సంస్థ గల కంట్రోల్ రూమ్, ఫ్లోటింగ్ సోలార్‌ప్లాంట్, సీ వాటర్ పంపుహౌస్‌ను సందర్శించారు. ఈ కార్యక్రమంలో సింహాద్రి ప్రాజెక్టు హెడ్ సంజయ్‌కుమార్ సిన్హా, హెచ్ఆర్ డైరెక్టర్ ప్రాణిగ్రాహి, వివిధ విభాగాల జీఎంలు, ఏజీఎంలు పాల్గొన్నారు.



ప్రొఫెనల్ సర్కిల్ కన్వెన్స్ ప్రారంభిస్తున్న దిలీప్‌కుమార్ పటేల్

జాతీయ లోక్ అదాలత్‌లో 135 కేసులు పరిష్కారం

ఎలమంచిలి, మార్చి 16: స్థానిక కోర్టు సముదాయంలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్‌లో 135 కేసులు పరిష్కారమయ్యాయి. సీనియర్ సివిల్ జడ్జి ఎ.సాయికుమారి, ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి పి. స్వాతి భవానీ ఈ కేసులను పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో లోక్ అదాలత్ సభ్యులు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.



లోక్ అదాలత్‌లో పాల్గొన్న సీనియర్ సివిల్ జడ్జి సాయికుమారి, ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి స్వాతి భవానీ

రామన్నపాలెంలో కొళాయిలు ప్రారంభం

అచ్యుతాపురం, మార్చి 15: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జలజీవన్ మిషన్‌లో ఏర్పాటు చేసిన ఇంటింటా కొళాయిలను సర్పంచ్ ధర్మిరెడ్డి నాయుడు బాబు శనివారం ప్రారంభించారు. అలాగే రూ.72 లక్షలతో చేయనున్న పనులకు ఆయన భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు లాలం శ్రీనివాసరావు, ధర్మిరెడ్డి అప్పారావు, లాలం సత్తిబాబు, సత్యనారాయణ, వేంకటేష్, కూండ్రపు వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

పాయకరావుపేట, మార్చి 16 : మండలంలో సోమవారం నుంచి జరగనున్న పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు చేసినట్టు ఎంఈవో కేఎన్.గాంధీ తెలిపారు. మండలంలో అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన 1,722 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారన్నారు. ఇందుకోసం పాయకరావుపేటలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జడ్పీ బాలికోన్నత పాఠశాల, శ్రీప్రకాష్, శ్రీచైతన్య టెక్నో, కనోసా పబ్లిక్ స్కూల్, ఎస్.నర్సాపురం, పాల్తేరు జడ్పీ ఉన్నత పాఠశాలలున్నాయన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు.

రాంబిల్లిలో.. మండలంలో నాలుగు కేంద్రాల్లో పదో తరగతి పరీక్షలు జరగనున్నట్టు ఎంఈవోలు ఎం.సూర్యారావు, వి.సూర్యనారాయణ తెలిపారు. సోమవారం నుంచి రాంబిల్లిలో 2 సెంటర్లు, దిమిలి, పంచదార్ల సెంటర్లలో 561 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నట్టు చెప్పారు. ఉదయం 9.30 గంటలు నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్షలు జరుగుతాయన్నారు.

సబ్బవరంలో.. పదో తరగతి పరీక్షలకు ఏర్పాటు పూర్తి చేసినట్టు ఎంఈవో లక్ష్మణరావు తెలిపారు. సోమవారం నుంచి జరగనున్న పరీక్షలకు ఐదు కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఈ కేంద్రాల్లో 921 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారని, వీరిలో 500 మంది బాలురు, 421 మంది బాలికలు ఉన్నారన్నారు. సబ్బవరం ప్రభుత్వ హైస్కూల్లో 236 మంది, సన్‌రిడ్జ్ స్కూల్లో 134, ప్రతిభ విద్యాలయంలో 237, మదర్ పబ్లిక్ స్కూల్లో 205, రావలమ్మపాలెం జడ్పీ హైస్కూల్‌లో 142 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారన్నారు.

పొట్టి శ్రీరాములుకు ఘన నివాళి

అనకాపల్లి టౌన్, మార్చి 16 : అమరజీవి పొట్టి శ్రీరాములు 123వ జయంతి సందర్భంగా శనివారం కన్యకాపరమేశ్వరి ఆలయ జంక్షన్‌లోని పొట్టి శ్రీరాములు విగ్రహానికి సిద్ధార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు బల్లా నాగభూషణం పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పట్నాల కృష్ణమోహన్, వినకోట నీలేష్‌గుప్తా, రొబ్బి మల్లేశ్వరరావు, బల్లా శ్రీనివాసరావు, పిరాట్ల నరసింహమూర్తి నివాళులర్పించారు.

ఆర్ఏఆర్ఎస్‌లో..

అనకాపల్లి అగ్రికల్చర్: స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో శనివారం అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా పొట్టి శ్రీరాములు చిత్రపటానికి ఏడీఆర్ డాక్టర్ సీహెచ్ ముకుందరావు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ డి.ఆదిలక్ష్మి, డాక్టర్ ఎం.విశాలాక్షి, డాక్టర్ బి. భవాని, డాక్టర్ సీహెచ్ రామలక్ష్మి పాల్గొన్నారు.



పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాల వేస్తున్న బల్లా నాగభూషణం

వైసీపీ నుంచి జనసేనలో చేరిక

అచ్యుతాపురం, మార్చి 15: మునగపాక మండలం చెర్లోపాలెంకి చెందిన వైసీపీ నాయకులు, కార్యకర్తలు శనివారం అచ్యుతాపురం కార్యాలయంలో జనసేన పార్టీలో చేరారు. చెర్లోపల్లికి చెందిన జనసేన నాయకుడు దవులూరి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో వైసీపీ నాయకుడు డి.వెంకటరమణ, అప్పలరాజుతోపాటు పది మంది జనసేనలో చేరారు. వీరందరికి సుందరపు విజయకుమార్ పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో బైలపూడి శ్రీరామదాసు, కొక్కిరగెడ్డ పవన్ విజయ్ కరెడ్ల సూర్యప్రకాష్, పి.శివశంకర్, ఎన్.నాగేశ్వరరావు, సరోజిని పాల్గొన్నారు.



జనసేనలో చేరిన వారితో సుందరపు విజయకుమార్

అక్రమార్కుల అడ్డదారి

... 5వ పేజీ తరువాయి

భూమి, ప్రధాన గెడ్డలో దర్జాగా పనులు చేపడుతున్నా స్థానిక రెవెన్యూ, నీటి పారుదల శాఖ అధికారులు పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. ప్రధాన గెడ్డలో పైపులు ఏర్పాటు చేసి ఇష్టానుసారంగా కప్పేస్తే భారీ వర్షాలకు కొండవాగు నుంచి వచ్చే నీరు ఎక్కడికి వెళతుందని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. దీనిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. ఈ విషయమై పరవాడ తహసీల్దార్ గణపతిరావును వివరణ కోరగా ఇది తన దృష్టికి వచ్చిందని, గెడ్డను పూడ్చి వేయడం జరగదన్నారు. జీవీఎంసీ నుంచి వారికి అనుమతులు ఉన్నాయని పొంతన లేని సమాధానం చెప్పారు. కాగా ప్రధాన గెడ్డ నుంచి పైపు కల్వర్టు నిర్మాణానికి తాము ఎటువంటి అనుమతులు ఇవ్వలేదని నీటి పారుదల శాఖ ఏఈ రామ్‌లక్ష్మణ్ తెలిపారు. గెడ్డను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని ఆయన చెప్పారు.

వైసీపీలో వీడిన ఉత్కంఠ

... 5వ పేజీ తరువాయి

దిగుతున్నారు. 2014 అసెంబ్లీ ఎన్నికల్లో సమీప టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చింతకాయల అయ్యన్నపాత్రుడుపై పోటీ చేసి స్వల్ప తేడాతో ఓడిపోయారు. 2019 అసెంబ్లీ ఎన్నికల్లో మళ్లీ అయ్యన్నపాత్రుడుపై పోటీ చేసి విజయం సాధించారు.

'పేట' నుంచి కంబాల జోగులు

పాయకరావుపేట: రానున్న ఎన్నికల్లో పాయకరావుపేట నియోజకవర్గం నుంచి వైసీపీ అభ్యర్థిగా ప్రస్తుతం విజయనగరం జిల్లా రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు పోటీ చేయనున్నారు. సిట్టింగ్ ఎమ్మెల్యే గొల్ల బాబూరావును పార్టీ అధిష్ఠానం రాజ్యసభకు పంపిన నేపథ్యంలో కంబాల జోగులును ఇక్కడి నుంచి పోటీకి దింపింది. 1995లో టీడీపీలో చేరిన జోగులు 2004 ఎన్నికల్లో పాలకొండ అసెంబ్లీ స్థానానికి టీడీపీ అభ్యర్థిగా పోటీచేసి గెలుపొందారు. అనంతరం 2009లో ప్రజారాజ్యం పార్టీలో చేరి పాలకొండ నుంచి పోటీచేసి ఓడిపోయారు. అనంతరం 2012లో వైసీపీలో చేరిన ఆయన 2014, 2019 ఎన్నికల్లో రాజాం అసెంబ్లీ స్థానానికి వరుసగా రెండుసార్లు వైసీపీ తరఫున పోటీచేసి గెలుపొందారు.

భరత్ రాజకీయ అరంగేట్రం

వైసీపీ అనకాపల్లి అసెంబ్లీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న మలసాల భరత్‌కుమార్ రాజకీయ అరంగేట్రం చేస్తున్నారు. ఆయనకు విదేశాల్లో సాఫ్ట్‌వేర్ కంపెనీలు ఉన్నాయి. ఆయన తల్లి కాసులమ్మ అలియాస్ ధనమ్మ 2007 నుంచి 2012 వరకు ఎంపీపీగా, రెండుసార్లు కశింకోట జడ్పీటీసీ సభ్యురాలుగా పని చేశారు. ఆయన తండ్రి మలసాల రమణారావు 1990లో టీడీపీలో చేరారు. మండల అధ్యక్షునిగా పదేళ్ల పని చేశారు. ఆర్ఈసీఎస్ చైర్మన్‌గా టీడీపీ హయాంలో పని చేశారు. ప్రస్తుతం విశాఖ డెయిరీ డైరెక్టర్‌గా కొనసాగుతున్నారు.

రెండోసారి బరిలోకి..

పెందుర్తి : పెందుర్తి నియోజకవర్గం నుంచి వైసీపీ అభ్యర్థిగా అన్నంరెడ్డి అదీప్‌రాజ్ మరోసారి పోటీ చేయనున్నారు. ఇరవై మూడేళ్ల వయసులో రాజకీయాల్లోకి వచ్చిన అదీప్‌రాజ్ 2006లో పెందుర్తి మండలం రాంపురం సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. అప్పట్లో కాంగ్రెస్ సీనియర్ నేతలు కొణతాల రామకృష్ణ, గండి బాబ్జీ అనుచరునిగా ఉండేవారు. 2007లో జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షునిగా నియమితులయ్యారు. గండి బాబ్జీ, కొణతాల వైసీపీలో చేరడంతో అదీప్‌రాజ్ వారిని అనుసరించారు. గండి బాబ్జీ వైసీపీకి రాజీనామా చేయడంతో ఆ పార్టీకి పెందుర్తి నియోజకవర్గ కన్వీనర్‌గా నియమితులయ్యారు. 2019 ఎన్నికల్లో అధిష్ఠానం టికెట్ ఇచ్చింది. ముక్కోణ పోటీలో టీడీపీ అభ్యర్థి మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తిపై విజయం సాధించారు.

వలంటీర్ల తప్పులను ఎండగట్టాలి : కొణతాల



సమావేశంలో మాట్లాడుతున్న కొణతాల రామకృష్ణ

కొత్తూరు, మార్చి 16 : వలంటీర్లు చేస్తున్న తప్పులను ఎప్పటికప్పుడు ఎండగట్టాలని జనసేన పార్టీ నాయకులకు, కార్యకర్తలకు ఉమ్మడి అభ్యర్థి కొణతాల రామకృష్ణ పిలుపునిచ్చారు. శనివారం కొణతాల క్యాంపు కార్యాలయంలో జనసేన పార్టీ కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వలంటీర్లు ఇంటింటికీ తిరిగి వైసీపీ ఓట్లు గుర్తించి ఫొటోలు తీయడం గాని, వృద్ధులతో సంతకాలు సేకరించడం గాని చేసినట్టయితే వెంటనే వారిని అడ్డుకొని సమాచారం అందించాలన్నారు.

వైసీపీ ప్రభుత్వ హయాంలో ఉద్యోగాలు లేవు

▸▸ తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షురాలు అనిత



జేపీ పాలెంలో అనితకు హారతులు పడుతున్న మహిళలు

ఎస్.రాయవరం, మార్చి 16: వైసీపీ పాలనలో ఉద్యోగాలు లేక యువకులు తీవ్ర ఇబ్బందులు పడ్డారని పాయకరావుపేట టీడీపీ-జనసేన-బీజేపీ ఉమ్మడి అభ్యర్థి వంగలపూడి అనిత అన్నారు. శనివారం జేపీపాలెం, వేమగిరి గ్రామాల్లో ఆమె ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పేదలు పనిచేయడానికి ఇసుక, ఇతర నిర్మాణ సామగ్రి ధరలు పెంచేయడంతో పనులు లేకుండా జగన్ ప్రభుత్వం చేసిందన్నారు. నష్టపోయిన రాష్ట్రాన్ని మరలా బాగు చేసుకోవాలన్నా.. ప్రజలకు మంచి జరగాలన్నా.. టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి ప్రభుత్వం రావాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ వజ్రపు కృష్ణకుమారి, ఎంపీటీసీ సభ్యుడు కె.శ్రీను, వజ్రపు శంకరరావు పాల్గొన్నారు.

పెందుర్తి టికెట్ బండారుకు ఇవ్వాలని ఆందోళన



ఎన్టీఆర్ విగ్రహం వద్ద ఆందోళన చేస్తున్న టీడీపీ శ్రేణులు

పరవాడ, మార్చి 16: పెందుర్తి అసెంబ్లీ టీడీపీ టికెట్‌ను మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తికి ఇవ్వాల్సిందేనని పార్టీ శ్రేణులు డిమాండ్ చేశాయి. ఈ మేరకు వెన్నెలపాలెంలో శనివారం బండారు నివాసం నుంచి స్థానిక ఎన్టీఆర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించాయి. పెందుర్తి టికెట్ విషయంలో పార్టీ అధినేత చంద్రబాబునాయుడు మరోసారి పునరాలోచన చేయాలని డిమాండ్ చేశాయి. అనంతరం ఎన్టీఆర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశాయి. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మాసవరపు అప్పలనాయుడు, పార్టీ నాయకులు వియ్యపు చిన్న, మచ్చా శివకుమార్, పైలా చినఅక్కునాయుడు, పైలా వరలక్ష్మి, పైలా రథాల సన్యాసిరావు, ఇందల కొండలరావు, నాయకులు పాల్గొన్నారు.

పది పరీక్షలకు పటిష్ఠ బందోబస్తు : ఎస్పీ

అనకాపల్లి రూరల్, మార్చి 16 : జిల్లాలో సోమవారం నుంచి జరగనున్న పదో తరగతి పరీక్షల నిర్వహణకు పటిష్ఠ పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేసినట్టు ఎస్పీ కేవీ మురళీకృష్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రశాంత వాతావరణంలో పదో తరగతి పరీక్షలు జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ పక్కాగా అమలయ్యేలా పోలీస్ అధికారులు దృష్టి కేంద్రీకరించాలన్నారు.

దివ్యాంగులకు ఉపకరణాలు అందజేత

పరవాడ, మార్చి 16 : సింహాద్రి ఎన్టీపీసీకి చెందిన దీపికా లేడీస్‌క్లబ్ ఆధ్వర్యంలో శనివారం దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీ చేపట్టారు. దీనిలో భాగంగా పరవాడ భవితా కేంద్రం దివ్యాంగులకు మూడు వీల్ చైర్లు, పది వినికిడి యంత్రాలు, ఒక స్మార్ట్‌కేన్ దీపికా లేడీస్ క్లబ్ అధ్యక్షురాలు అంజుసిన్హా అందజేశారు. ఈ కార్యక్రమంలో సంయుక్త మహిళా సమితి సీనియర్ మెంబర్ మమతాపటేల్, సీఎస్ఆర్ ప్రతినిధి కె. ప్రకాశరావు, భవిత కేంద్రం టీచర్లు కుమారి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రజాప్రతినిధుల ఫొటోలు తొలగింపు

నక్కపల్లి, మార్చి 16: కేంద్ర ఎన్నికల సంఘం శనివారం ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసిన వెంటనే ఎన్నికల కోడ్‌ను అమలు చేసేందుకు మండల స్థాయి అధికారులు చర్యలు చేపట్టారు. మండల కేంద్రంలోని పలు ప్రభుత్వ కార్యాలయాల్లో ఉన్న సీఎం, ప్రధాని ఫొటోలను వెంటనే తొలగించారు. కార్యాలయాల బయట వున్న శిలాఫలకాలను కూడా మూసివేశారు.

రాజయ్యపేటలో గ్రంథాలయం పునఃప్రారంభం

నక్కపల్లి, మార్చి 16: మండలంలోని రాజయ్యపేటలో గురుమందిరంలో గ్రంథాలయాన్ని శనివారం పునఃప్రారంభించారు. అదేవిధంగా ఇటీవల మరణించిన పిక్కి కామేశ్వరరావు జ్ఞాపకార్థం 30 మంది నిరుపేదలకు బియ్యం బస్తాలను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పిక్కి అప్పలనర్స, పిక్కి సత్తియ్య, పిక్కి కొండలరావు, మైలపల్లి బాబూజీ,వాసుపల్లి రాము, శివాజీ పాల్గొన్నారు.

'కొణతాల గెలుపునకు కృషి చేయాలి'

కశింకోట, మార్చి 16 : జనసేన-టీడీపీ-బీజేపీ ఉమ్మడి అభ్యర్థి కొణతాల రామకృష్ణ గెలుపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలుగు రైతు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉగ్గిన రమణమూర్తి, రాష్ట్ర అధికార ప్రతినిధి గొంతిన శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. శనివారం వారు ఏనుగుతుని, నూతనగుంటపాలెం గ్రామాల్లో నిర్వహించిన టీడీపీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ.. రామకృష్ణ విజయం కోసం కార్యకర్తలంతా అంకిత భావంతో పనిచేయాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ కార్యకర్తలు గొంతిన చిరంజీవి, అందె సన్యాసిరావు, వెంకటరావు, నాయుడు, నైనంశెట్టి రమణారావు, ఉల్లింగల రమేష్ పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో కేంద్ర బలగాల కవాతు

కశింకోట, మార్చి 16 : ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని పలుగ్రామాల్లో శనివారం కేంద్ర బలగాలు కవాతు నిర్వహించాయి. ఎస్ఐ రమేష్‌బాబు ఆధ్వర్యంలో తేగాడ, వెదురుపర్తి, వైతుని, పిసోమవరం, నర్సింగబిల్లి, ఎన్‌జీపాలెం గ్రామాల్లో 60 మంది సీఐఎస్ఎఫ్ బలగాలు కవాతు చేశాయి.

పీఎంయూవైని సద్వినియోగం చేసుకోవాలి

పాయకరావుపేట రూరల్, మార్చి16: ప్రధానమంత్రి ఉజ్వల యోజనను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ చిక్కాల రామారావు అన్నారు. పెంటకోటలో శనివారం కొత్త గ్యాస్ కనెక్షన్‌లను మహిళలకు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేదలకు కుటుంబాలకు ఈ పథకం కింద ఉపయోగకరమన్నారు.


టెన్త్ విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ

కోటవురట్ల, మార్చి 16: గొట్టివాడలో టెన్త్ విద్యార్థులకు పరీక్ష సామగ్రిని టీడీపీ జిల్లా వాణిజ్య విభాగం సెక్రటరీ సుంకర బాబ్జి శనివారం పంపిణీచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు.

ప్రచారానికి చోడవరం టీడీపీ అభ్యర్థి శ్రీకారం

▸▸ ప్రతిసారి మాదిరిగానే రేవళ్లు నుంచి ప్రారంభించిన కేఎస్ఎన్ఎస్ రాజు

▸▸ రాష్ట్ర భవిష్యత్తు కోసం చంద్రబాబుకు ప్రజలు పట్టం కట్టాలని విజ్ఞప్తి



రేవళ్లు గ్రామంలో ప్రచారం నిర్వహిస్తున్న కేఎస్ఎన్ఎస్ రాజు

చోడవరం, మార్చి 16 : టీడీపీ చోడవరం ఎమ్మెల్యే అభ్యర్థి కేఎస్ఎన్ఎస్ రాజు శనివారం ఉదయం ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టారు. ప్రతి ఎన్నికల మాదిరిగానే ఈసారి కూడా తన ప్రచారాన్ని ఆయన రేవళ్ల గ్రామం నుంచే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర భవిష్యత్తు కోసం అంతా చంద్రబాబుకు ఈ ఎన్నికల్లో పట్టం కట్టాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. అనంతరం పట్టణంలోని అన్నవరం, వెంకయ్యగారిపేటల్లో మాజీ ఎమ్మెల్యే రాజు ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర తెలుగురైతు ఉపాధ్యక్షుడు గూనూరు మల్లునాయుడు, మాజీ ఎంపీపీ పెదబాబు, జడ్పీటీసీ సభ్యుడు మత్స్యరాజు, పార్టీ మండల అధ్యక్షుడు బొడ్డేడ నాగగంగాధర్, జనసేన నాయకులు సిరిపురపు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

620 మందిపై బైండోవర్

మాకవరపాలెం, మార్చి 16 : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ముందస్తు చర్యల్లో భాగంగా 620 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేశామని ఎస్ఐ రామకృష్ణారావు శనివారం తెలిపారు. మండలంలోని అన్ని పంచాయతీల్లో ఇరు పార్టీలకు చెందిన పలువురిపై ఈ కేసులు నమోదు చేశామన్నారు. అలాగే ఎన్నికల వేళ గ్రామాల్లో ఎటువంటి తగాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నట్టు చెప్పారు. సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించినట్టు వివంచారు.

నిరాశ్రయుల వసతి గృహంలో వైద్య శిబిరం

నర్సీపట్నం, మార్చి 16 : పెదబొడ్డేపల్లిలోని నిరాశ్రయుల వసతి గృహంలో మెప్మా ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. రోగులకు బీసీ, షుగర్ పరీక్షలు చేసి మందులు అందజేశారు. మెప్మా పీడీ ఎన్.సరోజిని, మునిసిపల్ వైస్ చైర్మన్లు కోనేటి రామకృష్ణ, తమరాన అప్పలనాయుడు, కౌన్సిలర్ బుల్లిదొర తదితరులు పాల్గొన్నారు.

అక్రమార్కుల అడ్డదారి

... 5వ పేజీ తరువాయి

భూమి, ప్రధాన గెడ్డలో దర్జాగా పనులు చేపడుతున్నా స్థానిక రెవెన్యూ, నీటి పారుదల శాఖ అధికారులు పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. ప్రధాన గెడ్డలో పైపులు ఏర్పాటు చేసి ఇష్టానుసారంగా కప్పేస్తే

భారీ వర్షాలకు కొండవాగు నుంచి వచ్చే నీరు ఎక్కడికి వెళుతుందని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. దీనిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. ఈ విషయమై పరవాడ తహసీల్దార్ గణపతిరావును వివరణ కోరగా ఇది తన దృష్టికి వచ్చిందని, గెడ్డను పూడ్చి వేయడం జరగదన్నారు. జీవీఎంసీ నుంచి వారికి అనుమతులు ఉన్నాయని పొంతన లేని సమాధానం చెప్పారు. కాగా ప్రధాన గెడ్డ నుంచి పైపు కల్వర్టు నిర్మాణానికి తాము ఎటువంటి అనుమతులు ఇవ్వలేదని నీటి పారుదల శాఖ ఏఈ రామ్‌లక్ష్మణ్ తెలిపారు. గెడ్డను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని ఆయన చెప్పారు.

వైసీపీలో వీడిన ఉత్కంఠ

... 5వ పేజీ తరువాయి

దిగుతున్నారు. 2014 అసెంబ్లీ ఎన్నికల్లో సమీప టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చింతకాయల అయ్యన్నపాత్రుడుపై పోటీ చేసి స్వల్ప తేడాతో ఓడిపోయారు. 2019 అసెంబ్లీ ఎన్నికల్లో మళ్లీ అయ్యన్నపాత్రుడుపై పోటీ చేసి విజయం సాధించారు.

'పేట' నుంచి కంబాల జోగులు

పాయకరావుపేట: రానున్న ఎన్నికల్లో పాయకరావుపేట నియోజకవర్గం నుంచి వైసీపీ అభ్యర్థిగా ప్రస్తుతం విజయనగరం జిల్లా రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు పోటీ చేయనున్నారు. సిట్టింగ్ ఎమ్మెల్యే గొల్ల బాబూరావును పార్టీ అధిష్ఠానం రాజ్యసభకు పంపిన నేపథ్యంలో కంబాల జోగులును ఇక్కడి నుంచి పోటీకి దింపింది. 1995లో టీడీపీలో చేరిన జోగులు 2004 ఎన్నికల్లో పాలకొండ అసెంబ్లీ స్థానానికి టీడీపీ అభ్యర్థిగా పోటీచేసి గెలుపొందారు. అనంతరం 2009లో ప్రజారాజ్యం పార్టీలో చేరి పాలకొండ నుంచి పోటీచేసి ఓడిపోయారు. అనంతరం 2012లో వైసీపీలో చేరిన ఆయన 2014, 2019 ఎన్నికల్లో రాజాం అసెంబ్లీ స్థానానికి వరుసగా రెండుసార్లు వైసీపీ తరఫున పోటీ చేసి గెలుపొందారు.

భరత్ రాజకీయ అరంగేట్రం

వైసీపీ అనకాపల్లి అసెంబ్లీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న మలసాల భరత్‌కుమార్ రాజకీయ అరంగేట్రం చేస్తున్నారు. ఆయనకు విదేశాల్లో సాఫ్ట్‌వేర్ కంపెనీలు ఉన్నాయి. ఆయన తల్లి కాసులమ్మ అలియాస్ ధనమ్మ 2007 నుంచి 2012 వరకు ఎంపీపీగా, రెండుసార్లు కశింకోట జడ్పీటీసీ సభ్యురాలుగా పని చేశారు. ఆయన తండ్రి మలసాల రమణారావు 1990లో టీడీపీలో చేరారు. మండల అధ్యక్షునిగా పదేళ్లు పని చేశారు. ఆర్ఈసీఎస్ చైర్మన్‌గా టీడీపీ హయాంలో పని చేశారు. ప్రస్తుతం విశాఖ డెయిరీ డైరెక్టర్‌గా కొనసాగుతున్నారు.

రెండోసారి బరిలోకి..

పెందుర్తి : పెందుర్తి నియోజకవర్గం నుంచి వైసీపీ అభ్యర్థిగా అన్నంరెడ్డి అదీప్‌రాజ్ మరోసారి పోటీ చేయనున్నారు. ఇరవై మూడేళ్ల వయసులో రాజకీయాల్లోకి వచ్చిన అదీప్‌రాజ్ 2006లో పెందుర్తి మండలం రాంపురం సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. అప్పట్లో కాంగ్రెస్ సీనియర్ నేతలు కొణతాల రామకృష్ణ, గండి బాబ్జీ అనుచరునిగా ఉండేవారు. 2007లో జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షునిగా నియమితులయ్యారు. గండి బాబ్జీ, కొణతాల వైసీపీలో చేరడంతో అదీప్‌రాజ్ వారిని అనుసరించారు. గండి బాబ్జీ వైసీపీకి రాజీనామా చేయడంతో ఆ పార్టీకి పెందుర్తి నియోజకవర్గ కన్వీనర్‌గా నియమితులయ్యారు. 2019 ఎన్నికల్లో అధిష్ఠానం టికెట్ ఇచ్చింది. ముక్కోణ పోటీలో టీడీపీ అభ్యర్థి మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తిపై విజయం సాధించారు.

ఎన్నికల్లో వలంటీర్ల ప్రమేయం ఉండదు

▸▸ ఈసీ నిబంధనల మేరకు చర్యలు ▸▸ పక్కాగా కోడ్ అమలు ▸▸ నియోజవర్గాన్ని 24 జోన్‌లుగా విభజించి అధికారుల నియామకం : ఆర్డీవో జయరాం



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో జయరాం

నర్సీపట్నం, మార్చి 16 : ఎన్నికల్లో వలంటీర్ల ప్రమేయం లేకుండా చర్యలు తీసుకుంటామని ఆర్డీవో జయరాం స్పష్టం చేశారు. ఎన్నికల కమిషన్ ఎన్నికల షెడ్యూల్‌ను శనివారం ప్రకటించిన నేపథ్యంలో సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలుకు పటిష్ఠ చర్యలు తీసుకున్నామన్నారు. నియోజవర్గాన్ని 24 జోన్‌లుగా విభజించి, ప్రతి జోన్‌కు సెక్టార్ అధికారి, పోలీస్ సెక్టార్ అధికారిని నియమించామని తెలిపారు. నాలుగు మండలాలకు నలుగురు నోడల్ అధికారులు ఉంటారన్నారు. కోడ్ పక్కాగా అమలుకు నాలుగు టీములు పనిచేస్తాయన్నారు. రెండు వీడియో సర్వైలెన్స్ టీమ్‌లు, రెండు వీడియో వ్యూవింగ్ టీమ్‌లు, రెండు అకౌంటింగ్ టీమ్‌లు ఏర్పాటు చేశామని వివరించారు. ఐదేసి ఫ్లైయింగ్ స్క్వాడ్, స్టాటిక్ సర్వైలెన్స్ టీములు పని చేస్తాయన్నారు. బహిరంగ సమావేశాలు, ర్యాలీలు, నామినేషన్ల ప్రక్రియ, మ్యానిఫెస్టో విడుదల సమయంలో ఎన్నికల నిబంధనలకు లోపబడి చేయాన్నారు. చెక్ పోస్టుల వద్ద నిరంతరం నిఘా ఉంటుందన్నారు. ఒక వ్యక్తి వద్ద రూ.50 వేలకు మించి డబ్బులు ఉండరాదని, అధికారులు తనిఖీ చేసినప్పుడు ఆ డబ్బుకు సరైన ఆధారాలు చూపించాలన్నారు. రెండు రోజులకోసారి మద్య విక్రయాలు లెక్కలను ఎక్సైజ్ అధికారుల నుంచి తీసుకుంటామన్నారు. నియోజకవర్గంలో 2,08,869 మంది ఓటర్లు ఉన్నారని వివరించారు. ఈ సమావేశంలో తహసీల్దార్ శ్రీరాములు, ఎంపీడీవో కె.జాన్ లింకన్ పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు

▸▸ ప్రజలంతా సహకరించాలి : రిటర్నింగ్ ఆఫీసర్లు చిన్నికృష్ణ, సత్యవాణి



చోడవరంలో మాట్లాడుతున్న ఆర్‌వో చిన్నికృష్ణ

చోడవరం, మార్చి 16 : ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రజలు సహకరించాల్సిందిగా చోడవరం నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, అనకాపల్లి ఆర్డీవో ఏజీ చిన్నికృష్ణ విజ్ఞప్తిచేశారు. శనివారం రాత్రి ఆయన ఇక్కడి విలేకరులతో మాట్లాడారు. కోడ్ అమలులోకి వచ్చిన వెంటనే నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో రాజకీయ పక్షాలకు చెందిన కటౌట్లు, ఇతర ప్రచార చిత్రాల తొలగింపు ప్రారంభమైందన్నారు. 48 గంటల్లోగా ఈ కార్యక్రమం పూర్తవుతుందన్నారు. నియోజవర్గంలో 243 పోలింగ్ కేంద్రాలలో ఎన్నికల నిర్వహణ ఉంటుందని వివరించారు. ఎన్నికలు పూర్తయ్యేంత వరకు ఫ్లయింగ్ స్క్వాడ్, వీడియో మోనటరింగ్, అక్కౌంటింగ్ వంటి కమిటీలు విధి నిర్వహణలో ఉంటాయన్నారు. పోలింగ్ సామగ్రి పంపిణీకి స్థానిక ప్రభుత్వ హైస్కూల్‌లో సెంటర్ ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. పోలింగ్ సామగ్రి రిసీవింగ్ సెంటరు అనకాపల్లి శంకరం ఫ్యూచర్ వర్డ్ స్కూల్‌లో ఏర్పాటు చేశామన్నారు. నియోజకవర్గంలో 2,15,395 మంది ఓటర్లు ఉన్నారని, ఇంకా మార్పులు చేర్పులు చోటు చేసుకున్నాయని ఆయన తెలిపారు.

మాడుగులలో...



మాడుగులలో మాట్లాడుతున్న ఆర్‌వో సత్యవాణి

మాడుగుల రూరల్ : నియోజకవర్గంలో ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని మాడుగుల నియోజకవర్గ రిటర్నింగ్ ఆఫీసర్ జి.వి.సత్యవాణి తెలిపారు. శనివారం ఆమె ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల కోడ్‌ను పక్కాగా అమలు చేయనున్నామన్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, సంబంధిత ప్రదేశాలు, గ్రామాల్లో ఏ పార్టీకి చెందిన ఫ్లెక్సీలు, జెండాలు ఉండరాదన్నారు. నియోజకవర్గంలో 235 పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేశామన్నారు. సుమారు పదహారు వందల మంది ఎన్నికల విధులు నిర్వహించనున్నట్టు చెప్పారు. ఈ సమావేశంలో తహసీల్దార్ సత్యనారాయణ, ఎలక్షన్ డీటీ రాజా పాల్గొన్నారు.

ఎన్నికల షెడ్యూల్ విడుదలతో అధికారులు బిజిబిజీ

▸▸ బీఎల్‌వోలతో తహసీల్దార్లు సమావేశాలు ▸▸ రాజకీయ నాయకుల ఫ్లెక్సీలు, పార్టీల జెండాల తొలగింపుతో పాటు విగ్రహాలకు ముసుగుల తొడుగులు



బుచ్చెయ్యపేట, మాకవరపాలెంలలో బీఎల్‌వోలతో తహసీల్దార్ల సమావేశం





రోలుగుంట : కుసర్లపూడిలో విగ్రహానికి ముసుగు తొడుగు



రావికమతంలో ఫ్లెక్సీ తొలగింపు

బుచ్చెయ్యపేట : సార్వత్రిక ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినందున నిబంధనలను పక్కాగా అమలు చేయాలని తహసీల్దార్ శ్రీకాంత్ బీఎల్‌వోలను ఆదేశించారు. ఇక్కడి ఎంపీడీవో కార్యాలయ సమావేశం మందిరంలో శనివారం జరిగిన బీఎల్‌వోల సమావేశంలో మాట్లాడారు. నాయకుల విగ్రహాలకు మూసుగులు వేయాలని, ప్రభుత్వ స్థలాల్లో వివిధ రాజకీయ పార్టీలకు చెందిన ఫ్లెక్సీలు తొలగించాలని ఆదేశించారు. ఎన్నికల నియమాళిని ఉల్లఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో వెంకటాచార్యులు, డీహెచ్‌టీ అరుణ్‌చంద్ర, సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, ఈవోపీఆర్డీ విజయలక్ష్మి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

నర్సీపట్నం అర్బన్ : సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ విడుదలైన తరుణంలో అధికారులంతా అప్రమత్తంగా ఉండి విధులు నిర్వహించాలని నియోజకవర్గ ఎన్నికల నోడల్ అధికారి కె.జాన్‌లింకన్ సూచించారు. ఇక్కడి ఎంపీడీవో కార్యాలయంలో శనివారం నాలుగు మండలాలకు చెందిన ఎన్నికల సిబ్బందితో ఏర్పాటైన సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల నియమావళిలో భాగంగా రాజకీయ పార్టీల బ్యానర్లు, ఫెక్సీలను తొలగించాలన్నారు. అలాగే రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు తొడగాలని సూచించారు.

మాకవరపాలెం : ఎన్నికల నింబంధనలను గ్రామాల్లో పక్కగా అమలు చేయాలని తహసీల్దార్ ఎం.మురళీమోహనరావు ఆదేశించారు. శనివారం ఇక్కడ బీఎల్‌వోలతో ఏర్పాటైన సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల నియమావళి అమలులోకి వచ్చిన తరువాత గ్రామాల్లో ఉండే రాజకీయ పార్టీల నాయకుల ఫ్లెక్సీలు తొలగించాలని, నాయకుల విగ్రహాలకు ముసుగులు వేయాలని సూచించారు. అలాగే, ర్యాలీలు, రాజకీయ నాయకుల ప్రసంగాలపై ప్రతి ఒక్క అధికారి వీడియోలు తీయించాలన్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ శంకరరావు, ఈవోపీఆర్డీ సీతామహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గొలుగొండ : ఎన్నికల నియమావళిని మండలంలో పక్కాగా అమలు చేయాలని తహసీల్దార్ ప్రభాకర్‌రాజు సూచించారు. ఇక్కడి మండల పరిషత్ కార్యాలయంలో శనివారం కార్యదర్శులు, బీఎల్‌వోలకు, మండల పరిషత్ సిబ్బందితో ఏర్పాటైన సమావేశంలో మాట్లాడారు. విధి నిర్వహణలో అంతా అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ సమావేశంలో ఎంపీడీవో రత్నకుమారి, పలువురు అధికారులు పాల్గొన్నారు.

కృష్ణాదేవిపేట : ఎన్నికల షెడ్యూల్ ఖరారైన నేపథ్యంలో పల్లెల్లో ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా అంతా సహకరించాల్సిందిగా నర్సీపట్నం రూరల్ సీఐ బి.హరి కోరారు. శనివారం రాత్రి ఏఎల్‌పురం గొల్లవీధి ప్రజలతో ఏర్పాటైన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో గొడవలకు ఆస్కారం లేకుండా అంతా చూడాలన్నారు. రాజకీయ పార్టీలు పెట్టే ప్రలోభాలకు ఓటర్లు లొంగవద్దని సూచించారు. ఈ సమావేశంలో కృష్ణాదేవిపేట ఎస్ఐ ఎం.ఉపేంద్ర, వైసీపీ, టీడీపీ నాయకులు, పలువురు గ్రామస్థులు పాల్గొన్నారు.

రావికమతం : ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో శనివారం సాయంత్రం మండల అధికారులు రావికమతంలో రాజకీయ పార్టీలు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను తొలగించే పనిలోపడ్డారు. తహసీల్దార్ రమణారావు, ఎంపీడీవో భానోజీరావుల ఆధ్వర్యంలో సిబ్బంది మెయిన్ రోడ్డుతో పాటు వివిధ కార్యాలయాల వద్ద ఉన్న పోస్టర్లను, జెండాలను, అలాగే, కార్యాలయాల్లో ఉండే సీఎం జగన్ చిత్రపటాలను తొలగించారు. రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు తొడిగారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ హెచ్చరించారు.

రోలుగుంట : ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన నేపథ్యంలో మండలంలోని రెవెన్యూ అధికారులు అప్రమత్తమయ్యారు. ఈ మేరకు పలుచోట్ల రాజకీయ పార్టీల నాయకులు ఏర్పాట్లు చేసి ఫ్లెక్సీలు, జండాలను శనివారం సాయంత్రం తొలగించారు. పలు గ్రామాల్లో నాయకుల విగ్రహాలకు ముసుగులు వేస్తున్నారు. కుసర్లపూడి, జానకిరాంపురం గ్రామాల్లో ఈ చర్యలు చేపట్టారు.

మాడుగుల : ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో మండలంలోని అధికారులు ప్రభుత్వ కార్యాలయాలతో పాటు పట్టణంలోని పలుచోట్ల ఉన్న రాజకీయ పార్టీల నాయకుల ఫ్లెక్సీలు, జెండాలు తొలగించే కార్యక్రమాన్ని శనివారం సాయంత్రం ప్రారంభించారు. ఇందులో భాగంగా పలు ప్రభుత్వ వాహనాలపై ఉండే ముఖ్యమంత్రి చిత్రాలు కనిపించకుండా వైట్ పేపర్‌లను అతికించారు. అలాగే ఎన్నికల నిబంధనలను ప్రతిఒక్కరూ పాటించాల్సిందిగా సూచిస్తున్నారు.

చినభీమవరంలో పడమటమ్మ విగ్రహ ప్రతిష్ఠ



అమ్మవారిని దర్శించుకుంటున్న రత్నాకర్ తదితరులు

బుచ్చెయ్యపేట, మార్చి 16 : ఆర్.భీమవరం శివారు చినభీమవరంలో శనివారం పడమటమ్మ విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం గురువారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా వేకువజాము నుంచి విశేష పూజలు నిర్వహించారు. టీడీపీ విశాఖ జిల్లా మాజీ అధ్యక్షుడు దాడి రత్నాకర్, చోడవరం నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి బత్తుల తాతయ్యబాబు, నాయకులు వెలంకాయల అప్పలనాయుడు, గోవింద నాయుడు తదితరులతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుకున్నారు. ఆలయ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

'ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి'



విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎస్ఐ

చోడవరం, మార్చి 16 : ఆన్‌లైన్ మోసాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, విద్యార్థులు ఈ విషయంలో గ్రామీణులను చైతన్యపర్చాలని ఎస్ఐ సూర్యనారాయణ సూచించారు. ఇక్కడి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆన్‌లైన్ మోసాల నియంత్రణపై శనివారం ఏర్పాటైన అవగాహన సదస్సులో మాట్లాడారు. ఆన్‌లైన్‌మోసాలు, సోషల్ మీడియా పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. ఎవరైనా మోసానికి గురైతే వెంటనే 1930 నెంబరుకు ఫిర్యాదు చేయాలని కోరారు. ఈ సదస్సులో ప్రిన్సిపాల్ రాధాకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ కిరణ్, అధ్యాపకులు మాల్యాద్రి, రత్నప్రభ, భారతి, పిచ్చమ్మ, రఫియుద్దీన్, మహిళా పోలీసులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కృష్ణాదేవిపేట కళాశాల ప్రిన్సిపాల్‌గా శ్రీహరి



కృష్ణాదేవిపేట, మార్చి 16 : ఇక్కడి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా కె.శ్రీహరి శనివారం బాధ్యతలు స్వీకరించారు. విజయనగరం జిల్లా పూసపాటిరేగ ప్రభుత్వం జూనియర్ కళాశాలలో ఫిజిక్స్ అధ్యాపకుడిగా విధులు నిర్వహిస్తూ పదోన్నతిపై ఇక్కడికి విచ్చేశారు. ఈ సందర్భంగా అతనికి ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ రుత్తల గంగరాజు, అధ్యాపకులు శుభాకాంక్షలు తెలిపారు.

బాధితులకు రాజాం యూత్ ఆర్థిక సాయం

బుచ్చెయ్యపేట, మార్చి 16 : మండలంలోని రాజాం గ్రామానికి చెందిన యూత్ అసోసియేషన్ ప్రతినిధులు వివిధ ప్రమాదాల్లో గాయపడిన ముగ్గురు బాధితులకు శనివారం ఆర్థిక సాయం అందజేశారు. లక్ష్మణరావు కుటుంబానికి రూ.18,500, రోలుగుంట మండలానికి చెందిన అవినాష్‌కు రూ.5,600, బుచ్చెయ్యపేటకు చెందిన నక్క సత్యవతికి రూ.45,000లను అసోసియేషన్ అధ్యక్షుడు కంఠంరెడ్డి సూర్యనారాయణ, ఉపాధ్యక్షుడు నడిపిల్లి రవికుమార్, సభ్యులు సుబుద్ధి శ్రీరాములు, చిక్కాల శ్రీను, అప్పారావు అందించారు.

టెన్త్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి : ఎంఈవో



హెచ్ఎంలకు సూచనలిస్తున్న ఎంఈవోలు

కె.కోటపాడు, మార్చి 16 : పదో తరగతి పరీక్షలను మండలంలో కట్టుదిట్టమైన ఏర్పాట్ల నడుమ నిర్వహించాలని ఎంఈవో సత్యనారాయణ సూచించారు. మండలంలోని పలు పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో శనివారం ఇక్కడ నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఇందుకు సంబంధించి మండలంలో మూడు సెంటర్లు ఏర్పాటు చేశామన్నారు. 572 మంది రెగ్యులర్‌తో పాటు మరికొందరు ప్రైవేటు విద్యార్థులకు పరీక్షలకు హాజరు కానున్నారన్నారు. ఉదయం తొమ్మిదిన్నర గంటలలోపు విద్యార్థులు పరీక్షా కేంద్రానికి చేరుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఎంఈఓ-2 కె.ప్రసాద్‌తో పాటు పలు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

గ్రామాల్లో జల్ జీవన్ పనులు ప్రారంభం

గొలుగొండ, మార్చి 16 : మూడు గిరిజన గ్రామాల్లో జల్‌జీవన్ మిషన్ పనులను పాతమల్లంపేట సర్పంచ్ మామిడి ఆదిలక్ష్మి శనివారం ప్రారంభించారు. పాతమల్లంపేట గ్రామపంచాయతీ శివారు బుడ్డదపాడు, చంద్రయ్యపాలెం, అంటుమానుజోర్లు గ్రామాలకు ఈ పథకం కింద నీరు అందించేందుకు నిధులు మంజూరైనట్టు చెప్పారు. నాయకులు లెక్కల సత్యనారాయణ, కసిపల్లి చినప్పారావు, గెడ్డం ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో అభివృద్ధి పనులు ప్రారంభం



అభివృద్ధి పనుల ప్రారంభోత్సవంలో బూడి తదితరులు

దేవరాపల్లి, మార్చి 16 : మండలంలోని కొత్తపెంట, వాకపల్లి గ్రామాల్లో ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు శనివారం పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. సామాజిక భవనం, డ్రైనేజీ, సీసీ రోడ్లు, రక్షిత నీటి పథకం కుళాయిలను ప్రాంభించారు. అభివృద్ధే ధ్యేయంగా పాలన సాగిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ కర్రి సత్యం, నీలిమా వెంకటరావు, రొంగలి శంకరరావు, బుగత వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు. అలాగే, సీఎం సహాయ నిధి నుంచి విడుదలైన చెక్కులను పలువురు బాధితులకు అందజేశారు.

డ్రాయింగ్ పోటీల్లో విద్యార్థులకు పతకాలు



పతకాలు పొందిన విద్యార్థులతో ఉపాధ్యాయ సిబ్బంది

రోలుగుంట, మార్చి 16 : డ్రీమ్ యంగ్ అండ్ చిల్డ్రన్ ఆర్ట్ అకాడమీ ఆధ్వర్యంలో గుంటూరులో నిర్వహించిన ఆలిండియా ఆర్ట్ కాంపిటేషన్ అండ్ ఎగ్జిబిషన్ పోటీల్లో మండలంలోని రోలుగుంట జడ్పీ పాఠశాల విద్యార్థులు పాల్గొని చిత్రలేఖనంలో బంగారు పతకాలను సాధించారు. డ్రాయింగ్ ఉపాధ్యాయుడు అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఎనిమిది, తొమ్మిది తరగతులకు చెందిన ఏడుగురు విద్యార్థులు ఈ పోటీలకు హాజరయ్యారు. ఇందులో ఐదుగురు బంగారు పతకాలు, ఇద్దరు వెండి పతకాలు సాధించారు. ఈ మేరకు శనివారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో హెచ్ఎం డీఎస్ఎస్వీ ప్రసాద్, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

వాడవాడలా పొట్టి శ్రీరాములుకు ఘన నివాళి



మాకవరపాలెం : కొండలఅగ్రహారం గ్రామంలో పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద గ్రామస్థుల నివాళి



రావికమతం మండలం కొత్తకోటలో...



దేవరాపల్లి గ్రంథాలయంలో...

మాకవరపాలెం, మార్చి 16 : కొండలఅగ్రహారంలో పొట్టి శ్రీరాములు జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇక్కడి సచివాలయంలోని ఆయన విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆంధ్ర రాష్ట్ర సాధనకు పొట్టి శ్రీరాములు చేసిన కృషి ఎనలేనిదని కీర్తించారు. ఈ కార్యక్రమంలో నాకులు పోలిరెడ్డి రమణ, ఈశ్వరరావు, చిన్న, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నర్సీపట్నం : పొట్టి శ్రీరాములు జయంతిని స్థానిక ఆయుష్మాన్ వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కొత్తవీధి బైపాస్ రోడ్డులోని పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సభ్యులు వెలగా నారాయణరావు, కుచిమంచి కృష్ణ, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

దేవరాపల్లి : ఇక్కడి శాఖా గ్రంథాలయంలో పొట్టి శ్రీరాములు జయంతిని ఘనంగా నిర్వహించారు. గ్రంథాలయాధికారి ఓ.శ్రీనివాసరావు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రాష్ట్రసాధనకు శ్రీరాములు సాగించిన పోరాటాన్ని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠకులతో పాటు పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

రావికమతం : పొట్టి శ్రీరాములు జయంతిని మండలంలోని కొత్తకోట గ్రామంలో ఘనంగా నిర్వహించారు. సర్పంచ్ కోనలోవరాజు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రైం... crime news

రైలు ప్రమాదంలో గుర్తు తెలియని యువకుడి మృతి



మృతి చెందిన యువకుడు

అనకాపల్లి టౌన్, మార్చి 16 : అనకాపల్లి-ఆనందపురం రోడ్డు కింద రైల్వే ట్రాక్‌పై శనివారం గుర్తు తెలియని మృతదేహాన్ని కనుగొన్నామని దువ్వాడ జీఆర్‌పీ పోలీసులు తెలిపారు. విజయవాడ నుంచి విశాఖకు వెళ్లే మార్గంలోని పది అడుగుల దూరంలో మృతదేహం లభించిందని, మృతుని వయసు 30 ఏళ్లలోపు ఉంటుందని తెలిపారు. మృతుడు బ్లూ కలర్ జీన్‌ఫ్యాంట్ తప్ప శరీరంపై ఎటువంటి దుస్తులు లేవని తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు దువ్వాడ జీఆర్‌పీ పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందజేయాలని హెడ్‌కానిస్టేబుల్ రమేష్ తెలిపారు.

వివాహితను వేధిస్తున్న వ్యక్తిపై కేసు

ఎలమంచిలి, మార్చి 16 : మండలంలోని అచ్యుతపురం గ్రామానికి చెందిన వివాహితను వేధిస్తున్నట్టు అందిన ఫిర్యాదు మేరకు గ్రామానికి చెందిన బి.ప్రసాద్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని రూరల్ ఎస్ఐ సింహాచలం తెలిపారు. విచారణలో పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని తెలిపారు.

ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులతో ఎస్పీ సమీక్ష



అధికారుల సమీక్షలో మాట్లాడుతున్న ఎస్పీ కేవీ మురళీకృష్ణ

అనకాపల్లి రూరల్, మార్చి 16 : జిల్లా పోలీస్ కార్యాలయంలో శనివారం రాత్రి ఎన్‌ఫోర్స్‌మెంట్ నిర్వహించే వివిధ శాఖల అధికారులతో ఎస్పీ కేవీ మురళీకృష్ణ సమీక్ష సమావేశం నిర్వహించారు. సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలను ప్రలోభాలకు గురిచేసేందుకు నగదు, మద్యం, ఉచిత కానుకలను పంపిణీ చేసే అవకాశం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఇటువంటి వాటికి అడ్డుకట్ట వేసేందుకు ముందస్తు ప్రణాళికతో చెక్‌పోస్టుల వద్ద ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు. చెక్‌పోస్టుల వద్ద ముమ్మరంగా తనిఖీలను నిర్వహించాలన్నారు. ఎన్నికల నియమావళిని ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ అభ్యర్థి కోసం వైసీపీ తర్జనభర్జన

(అనకాపల్లి- ఆంధ్రజ్యోతి)

అనకాపల్లి పార్లమెంట్ అభ్యర్థిగా ఎవరిని బరిలో దించాలనే దానిపై వైసీపీ తర్జనభర్జన పడుతోంది. కూటమి తరఫున బీజేపీ అభ్యర్థిగా రాజ్యసభ సభ్యుడు సీఎం రమేశ్ ఎన్నికల బరిలో ఉంటారని ప్రచారం జరగడంతో దీటైన అభ్యర్థి కోసం వైసీపీ ప్రయత్నిస్తున్నట్టు తెలిసింది. సిట్టింగ్ ఎంపీ భీశెట్టి సత్యవతికి మళ్లీ అవకాశం ఇవ్వడానికి అధిష్ఠానం సుముఖంగా లేదు. ఇప్పటికే ఈ స్థానాన్ని బీసీ కేటగిరీకి కేటాయించిన నేపథ్యంలో మాడుగుల ఎమ్మెల్యే బూడి ముత్యాలునాయుడును ఎంపీ అభ్యర్థిగా ప్రకటించి, మాడుగుల నుంచి బూడి కుమార్తె, కె.కోటపాడు జడ్పీటీసీ సభ్యురాలు ఈర్ల అనురాధని పోటీలో పెట్టాలని భావిస్తున్నట్టు ప్రచారం జరుగుతోంది. అయితే ఇప్పటికే మాడుగుల అసెంబ్లీ అభ్యర్థిగా బూడి ముత్యాలనాయుడును అధిష్ఠానం ప్రకటించింది. ఈ నేపథ్యంలో మార్పు చేస్తారా?, లేదా? అనే దానిపై ఉత్కంఠ నెలకొంది.

సత్యవరంలో ఘనంగా గౌరీ శంకరుల జాతర

పాయకరావుపేట రూరల్, మార్చి 16: సత్యవరంలో గౌరీశంకరుల జాతర శనివారం ఘనంగా జరిగింది. తెల్లవారు జాము నుంచి భక్తులు అమ్మ వారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. జాతరలో గరగల డ్యాన్సులు, ఆర్కెస్ట్రా, కోలాటం, శక్తి వేషాలు, కర్రసాము, పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రజలను అలరించాయి. టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి వంగలపూడి అనిత, రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ చిక్కాల రామారావు, జనసేన నాయకులు గెడ్డం బుజ్జి, టీడీపీ నాయకులు పెదిరెడ్డి చిట్టిబాబు, గొర్రెల రాజుబాబు, దేవవరపు రాజుబాబు, తదితరులు అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు.

చంద్రబాబును కలిసిన మాజీ ఎమ్మెల్యే 'బోళెం'



చంద్రబాబుతో మాజీ ఎమ్మెల్యే ముత్యాలపాప, కుటుంబ సభ్యులు, అయ్యన్న

నర్సీపట్నం, మార్చి 16 : నర్సీపట్నం మాజీ ఎమ్మెల్యే బోళెం ముత్యాలపాప, ఆమె కుటుంబ సభ్యులు టీడీపీ జాతీయ అధ్యక్షుడు నా చంద్రబాబునాయుడును శనివారం మర్యాదపూర్వంగా కలిశారు. టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు ఆధ్వర్యంలో విజయవాడలోని చంద్రబాబు నివాసానికి వెళ్లి ఇరవై నిమిషాల పాటు ఆయనతో మాట్లాడారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ విజయానికి కలిసికట్టుగా పని చేయాలని చంద్రబాబు వారికి సూచించారు. ఈ కార్యక్రమంలో బోళెం ముత్యాల పాప భర్త వెంకటరమణ మూర్తి, ఆమె మరిది రామ్‌ప్రసాద్ పాల్గొన్నారు.

అమరజీవి పొట్టి శ్రీరాములుకు ఘన నివాళి





పొట్టి శ్రీరాములు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్, ఎస్పీ

అనకాపల్లి కలెక్టరేట్, మార్చి 16 : అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా శనివారం కలెక్టరేట్‌లో ఆయన చిత్రపటానికి జిల్లా కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమరజీవి పొట్టి శ్రీరాములు ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం 58 రోజులు ఆమరణ నిరాహారదీక్ష చేసి ప్రాణాలర్పించిన మహా పురుషుడని అన్నారు. డీఆర్‌ఓ దయానిధి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. అలాగే, జిల్లా పోలీస్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన పొట్టి శ్రీరాములు జయంతి కార్యక్రమంలో ఎస్పీ కేవీ మురళీ కృష్ణ పాల్గొని అమరజీవి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భాషా ప్రయుక్త రాష్ట్రం కావాలని ఉద్యమించిన మహానుభావుడని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ విజయభాస్కర్, డీటీఓ కేవీ ప్రకాశరావు పాల్గొన్నారు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	92.00
లైవ్ ధర	112.00
విత్ స్కిన్	196.00
స్కిన్ లెస్	206.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	425
విజయనగరం	429
శ్రీకాకుళం	429

పరిమితికి మించిన లోడుతో వాహనాలు

- ఆందోళన చెందుతున్న పట్టణ ప్రజలు
- పోలీస్ స్టేషన్ల ముందు నుంచే రాకపోకలు
- పట్టించుకోని పోలీసులు



ఎలమంచిలి పట్టణంలో పెద్ద రాళ్లతో వెళుతున్న భారీ వాహనం

ఎలమంచిలి, మార్చి 16: పట్టణంలో అధిక లోడు వాహనాల రాకపోకలతో పట్టణవాసులు భీతిల్లుతున్నారు. పెద్ద బండరాళ్లు ఉన్న వాహనాలు వేగంగా వెళుతుండడంతో వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. మునిసిపాలిటీలోనే పట్టపగలు దర్జాగా సమయం అంటూ లేకుండా ఇష్టారాజ్యంగా భారీ వాహనాలు వెళుతున్నా పోలీస్ యంత్రాంగం పట్టించుకోవడం లేదు. ఆటోలో అదనపు ప్రయాణికుడు ఉంటే ప్రతాపం చూపించే పోలీసులు ఈ వాహనాలను వదిలేయడాన్ని పట్టణవాసులు విమర్శిస్తున్నారు. మునిసిపాలిటీతోపాటు నియోజకవర్గ కేంద్రం కావడంతో నిత్యం ఉదయం నుంచి ప్రజల రాకపోకలతో పట్టణ రోడ్లు రద్దీగా ఉంటాయి. ఈ రద్దీలో కూడా భారీ వాహనాలు, బండరాళ్ల వాహనాలు వెళుతుండడంతో వెనుక నుంచి వెళుతున్న వాహనదారులు భయపడుతున్నారు. విచిత్రమేమిటంటే. ఈ వాహనాలన్నీ పోలీస్ స్టేషన్ల ముందు నుంచే తిరుగుతున్నా సరే పట్టించుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తున్నది. పట్టణంలో రూరల్, పట్టణ పోలీస్‌స్టేషన్‌ల ముందు నుంచే పగలు, రాత్రి అని తేడా లేకుండా అధిక బరువుతో ఉన్న వాహనాలు దూసుకువెళుతున్నాయి. తాళ్లపాలెం నుంచి ఎలమంచిలి పట్టణం మీదుగా రాంబిల్లి వైపు ప్రయాణించే ఈ వాహనాలపై ఉన్న బండరాళ్లు అదుపుతప్పి కిందపడితే ప్రాణాలు పోతాయనే ఆందోళన చెందుతున్నారు. సుమారు 50 వాహనాల వరకూ నిత్యం తిరుగుతున్నాయి. సామర్థ్యాన్ని మించి అధిక బరువుతో ప్రయాణించే వాహనాలపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

అల్లూరి పార్కుపై వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం

ఐదేళ్లుగా పట్టించుకోకపోవడంతో శిథిలావస్థకు కట్టడాలు

- కార్యరూపం దాల్చని నాటి మంత్రి ముత్తంశెట్టి, డిప్యూటీ సీఎం రాజన్నదొర హామీలు
- అల్లూరి యువజన సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు 'పడాల'



పార్కులో శిథిలమైన కట్టడాన్ని చూపుతున్న వీరభద్రరావు

కృష్ణాదేవిపేట, మార్చి 16 : స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు, గంటందొర సమాధులున్న గొలుగొండ మండలం కృష్ణాదేవిపేటలో గల అల్లూరి పార్కుపై గత ఐదేళ్లుగా వైసీపీ పాలకులు నిర్లక్ష్యం చూపారని అల్లూరి యువజన సంఘం జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడు పడాల వీరభద్రరావు ఆరోపించారు. ఈ కారణంగా నేడు పలు కట్టడాలు శిథిలావస్థకు చేరుకున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం ఆయన అల్లూరి పార్కును సందర్శించారు. తొలుత అల్లూరి, గంటందొరల సమాధుల వద్ద నివాళులర్పించిన అనంతరం మాట్లాడుతూ సమాధులున్న కట్టడం శ్లాబ్ పెచ్చులూడిపోయిందని వివరించారు. పర్యాటకులు సేదదీరేందుకు నిర్మించిన షెడ్లు శిథిలావస్థకు చేరుకోవడాన్ని విలేకరులకు చూపించారు. వైసీపీ ప్రభుత్వంలో పర్యాటక శాఖా మంత్రిగా ఉన్న సమయంలో ముత్తంశెట్టి శ్రీనివాసరావు, డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర పార్కు అభివృద్ధికి రూ.కోటి పది లక్షలు ప్రకటించి ఏళ్లు గడుస్తున్నా ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదని మండిపడ్డారు. ఇక్కడ పర్యాటకులకు తాగునీటి సౌకర్యం కల్పించే దిక్కులేకుండా పోయిందన్నారు. స్వాతంత్ర్య సమరయోధులకు వైసీపీ ప్రభుత్వం ఇచ్చే గౌరవం ఇదే అని ఆయన ప్రశ్నించారు. తక్షణమే పార్కు అభివృద్ధికి నిధులు విడుదల చేయకుంటే రానున్న ఎన్నికల్లో పర్యాటకులు, ఈ ప్రాంత ప్రజలు వైసీపీ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పక తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అల్లూరి యువజన సంఘం రాష్ట్ర కార్యదర్శి అంబటి వరహాలరాజు, కార్యవర్గ సభ్యుడు పంచాడ వెంకటరమణ, గంటందొర కుటుంబీకులు పాల్గొన్నారు.

రాష్ట్ర శ్రేయస్సు కోసమే పొత్తు

- జనసేన జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్‌బాబు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జనసేన జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్‌బాబు

తుమ్మపాల, మార్చి 16: రాష్ట్ర శ్రేయస్సు కోసమే టీడీపీ, జనసేన, బీజేపీ పొత్తుగా ముందుకెళుతున్నాయని జనసేన జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్‌బాబు అన్నారు. శనివారం టీడీపీ జిల్లా కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గత ఐదేళ్లలో అధికార పార్టీ నాయకులు అభివృద్ధిని పక్కన పెట్టి దోచుకోవడం.. దాచుకోవడమే పనిగా పాలన సాగించారన్నారు. ఆదివారం చిలకలూరిపేటలో ప్రజాగళం పేరుతో మహాసభను మూడు పార్టీలు కలిసి నిర్వహిస్తున్నాయన్నారు. సుమారు ఎనిమిది లక్షల మంది ప్రజలు ఈ సభకు హాజరుకానున్నారని చెప్పారు. పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరై ప్రజాగళాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. రాష్ట్రాన్ని 20 ఏళ్లు వెనక్కి తీసుకువెళ్లిపోయిన ఘనత జగన్మోహన్‌రెడ్డిదేనన్నారు. బూటకపు హామీలతో ఐదేళ్లపాటు రాష్ట్ర ప్రజలను నయవంచన చేశారన్నారు. కనీసం రాజధాని నిర్మాణాన్ని చేపట్టలేని జగన్‌రెడ్డి ఏకంగా మూడు రాజధానుల ప్రకటన హాస్యాస్పదమన్నారు. ఉమ్మడి విశాఖజిల్లాలో చిన్న సమస్యను కూడా పరిష్కరించలేకపోయారన్నారు.

రెల్లి సామాజికవర్గంపై వైసీపీ సర్కారు చిన్నచూపు

- ఓటు బ్యాంకుగానే చూస్తుండడం దారుణం
- హక్కుల సాధనకు ఐక్యంగా పోరాడాలి
- సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పాపారావు పిలుపు



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు పాపారావు

నాతవరం, మార్చి 16: రాష్ట్రంలో 30 లక్షల మంది జనాభా ఉన్న రెల్లి సామాజికవర్గాన్ని వైసీపీ ప్రభుత్వం ఓటు బ్యాంకుగానే చూస్తుందని రెల్లి హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు యర్రంశెట్టి పాపారావు ఆగ్రహం వ్యక్తం చేశారు. అత్యంత దుర్భర స్థితిలో జీవనం గడుపుతున్న రెల్లి కులస్థుల అభివృద్ధికి ఎటువంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. శనివారం నాతవరం మండలంలోని తాండవ సెంటర్‌లో జరిగిన జిల్లా స్థాయి రెల్లి కులస్థుల సమావేశంలో మాట్లాడారు. హక్కుల సాధనకు అంతా ఐక్యంగా పోరాటం సాగించాలని పిలుపునిచ్చారు. రెల్లి కులస్థులు చట్ట సభలకు వెళితేనే వెనుకబడిన ఉన్న తమ సామాజిక వర్గానికి అన్నివిధాలా న్యాయం జరుగుతుందన్నారు. నేడు ప్రభుత్వం కులగణన చేస్తున్నా తోటలలో, పాకల దగ్గర ఉంటున్న రెల్లి కులస్థుల వివరాలు తీసుకోకుండా తప్పుగా కులగణన చేస్తున్నారని ఆరోపించారు. రిజర్వేషన్లలో రెల్లి కులస్థులకు సామాజిక న్యాయం జరగాలన్నారు. అలాగే రామచంద్ర కమిషన్ సిఫార్సులు అమలు చేయాలని డిమాండ్ చేశారు. అంతకుముందు వెన్నలపాలెం నుంచి తాండవ సెంటర్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. తుని- నర్సీపట్నం రూట్‌లోని తాండవ సెంటర్ వద్ద మానవహారంగా ఏర్పడి సమస్యలు పరిష్కరించాలని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నాతవరం మండల నాయకులు బంగారు సూరిబాబు, బంగారు అబ్బు, బుచ్చియ్యపేట మండల మహిళా అధ్యక్షురాలు ముత్యాల త్రివేణి, బంగారు వెంకటేశ్వరరావు, వడ్డాది దేముడు, సంఘం చోడవరం మండల అధ్యక్షుడు పొట్నూరి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

నీటి సమస్యపై అజయ్‌పురం ఆదివాసీల ఆందోళన

- గ్రామంలో అంపూర్తిగా ఉన్న ట్యాంకు ఎక్కి మహిళలు నినాదాలు



నీటి సమస్యపై నినాదాలు చేస్తున్న గ్రామస్థులు

రావికమతం, మార్చి 16 : తాగు నీటి సమస్యపై మండలంలోని అజయ్‌పురం ఆదివాసీ మహిళలు శనివారం గ్రామంలో వినూత్న రీతిలో నిరసన తెలిపారు. అసంపూర్తిగా ఉన్న వాటర్ ట్యాంకుపైకి ఎక్కి నీటి కష్టాలు తీర్చాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం నాయకుడు పాంగి అజయ్‌కుమార్ మాట్లాడుతూ చీమలపాడు పంచాయతీ శివారున ఉన్న అజయ్‌పురంలో 130 మంది ఆదివాసీలు నివాసం ఉన్నారన్నారు. ఈ గ్రామం కొండ శిఖరంపై ఉండడంతో వేసవి కాలంలో తాగునీటికి వీరంతా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్టు వాపోయారు. గ్రామానికి జల్ జీవన్ మిషన్ పథకంలో రక్షిత మంచినీటి పథకం నిర్మించి, ఇంటింట కుళాయిల ద్వారా నీటిని అందించాల్సిందిగా కోరారు. గ్రామంలోని అసంపూర్తిగా ఉన్న ట్యాంకు నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం కార్యవర్గ సభ్యుడు కె.గోవిందరావు, పాంగి పద్మ, పి.వైలమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల బకాయిల విడుదలలోనూ జగన్‌రెడ్డి గిమ్మిక్కులు

- టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు



విలేకరులతో మాట్లాడుతున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు

తుమ్మపాల, మార్చి 16: ఉద్యోగులు, ఉపాధ్యాయుల పెండింగ్ బకాయిల విడుదలలోనూ జగన్‌రెడ్డి గిమ్మిక్కులు చేస్తున్నారని టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు విమర్శించారు. శనివారం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. ఉద్యోగులు జగన్‌రెడ్డి వలలో పడే రోజులు పోయాయన్నారు. తాజాగా ప్రకటించిన డీఏలతో ఇప్పటికిప్పుడు వైసీపీ ప్రభుత్వంపై పడే భారం పెద్దగా లేదని, దాన్ని కొత్త ప్రభుత్వంపైకి నెట్టేశారన్నారు. జనవరి డీఏ నగదు 2024 ఏప్రిల్ జీతంతో కలిపి మే నెలలో ఉద్యోగులకు ఇస్తారని జగన్ చెప్పడం చాలా విడ్డూరంగా ఉందన్నారు. ఐదేళ్లలో గుర్తుకు రాని డీఏలు ఎన్నికల నోటిఫికేషన్‌కి ముందు ప్రకటించడం ఎన్నికల స్టంటేనన్నారు. రాష్ట్ర పెన్షనర్ అసోసియేషన్ కార్యదర్శి బుద్ద కాశీ మాట్లాడుతూ విశ్రాంత ఉద్యోగులకు ఇవ్వాల్సిన డీఆర్ ఉత్తర్వులను విడుదల చేయలేదని, వీరికి బకాయిల్ని నగదు రూపంలో చెల్లించాలని, పాత బకాయిలనే చెల్లించని ప్రభుత్వం కొత్త వాటిపై స్పష్టత ఇవ్వలేదని ఆవేదన వ్యక్తపరిచారు. ఒక్కొక్క ఉద్యోగికి జగన్ సర్కారు రూ.2.5 లక్షలకు పైగా ఇప్పటికీ బకాయిలు ఉన్నాయని, 2022 జూలైలో డీఏ మంజూరు ఉత్తర్వులు ఇచ్చినా ఇంతవరకు ప్రయోజనాలు అందలేదన్నారు. 2018 జూలై 2019 జనవరి డీఏలకు సంబంధించిన దాదాపు 66 నెలల బకాయిలను చాలామంది ఉద్యోగులకు చెల్లించకుండా.. సాంకేతికంగా ఇచ్చేసినట్టు చూపించి ఉద్యోగుల నుంచి ఆదాయం పన్ను కూడా మినహాయించారని, ఇంతకంటే దుర్మార్గమైన చర్యలు మరొకటి ఉంటుందా అని ఆయన ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో నోబెల్ చారిటబుల్ ట్రస్ట్ గౌరవాధ్యక్షుడు కాండ్రేగుల సత్యనారాయణ పాల్గొన్నారు.

అనకాపల్లి ఆర్ఏఆర్ఎస్‌కు జాతీయ అవార్డు



అవార్డు అందుకుంటున్న డాక్టర్ జగన్నాథరావు, శ్రీదేవి

అనకాపల్లి అగ్రికల్చర్/కొత్తూరు, మార్చి 16: అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానంలోని పంటకోత అనంతర ఇంజనీరింగ్ టెక్నాలజీ సెంటర్‌కు జాతీయ స్థాయి తృతీయ ఉత్తమ అవార్డు లభించింది. లూథియానాలో ఈనెల 13 నుంచి 15వ తేదీ వరకు పంటకోత అనంతర ఇంజనీరింగ్ టెక్నాలజీపై జరిగిన 39వ అఖిలభారత సమన్వయ పరిశోధనా పథకం వార్షిక సమావేశంలో ఏడీఆర్ డాక్టర్ పీవీకే జగన్నాథరావు, అగ్రి ఇంజనీరింగ్ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ శ్రీదేవికి ఈ అవార్డును అందజేశారు. అనకాపల్లి పరిశోధనా స్థానం పంటకోత అనంతర ఇంజనీరింగ్ టెక్నాలజీ పరిశోధనలో జాతీయ స్థాయిలో ఖ్యాతి గడించింది.